


హనీబీఏపి

# పల్లె సృజన

జులై-సెప్టెంబర్ 2007

సంపుటి-2 సంచిక-1

## దోమల మందు కనుగొన్న క్షేత్రం
## కారాకొల్లు గ్రామం

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్

# 'హనీబీఏపి' ప్రగతి

'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ,. హనీబీనెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) సంస్థకు, మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలకు సంధానం చేయడం ఈ హనీబీఏపి సంస్థ మూలకార్యక్రమం.

నవంబర్ 2005లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.ఎల్. రావు గారు, శ్రీ పి. చంద్రకాంత శర్మల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా, గారిని ఆదర్శంగా, వారి మహత్తర సృజనాత్మక ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమైన హనీబీఏపి 'ఇంతింతై వటుడింతై....' అన్నట్టుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతోమంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడు వచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరి తోడు శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టిన, సాధించిన వివిధ కార్యక్రమాలు :

- ◆ 54 మంది ఇన్నోవేటర్స్‌ను మన రాష్ట్రంలో వెతికి వెలుగులోకి తేవడం.
- ◆ ఇద్దరు ఇన్నోవేటర్‌కు ఆర్థిక సహాయం చేసి ఉత్పత్తి చేసి తానే అమ్మగలిగే శక్తిని కల్పించడం.
- ◆ ముగ్గురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామికవేత్తలకు అందించి, ఆర్థికపరంగా ఒప్పందం కుదర్చటం.
- ◆ నలుగురు ఇన్నోవేటర్స్‌ను అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం, వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.
- ◆ అయిదుగు ఇన్నోవేటర్లను NAARM లోని శిక్షణా సంస్థలో వారి ఆవిష్కరణలను ప్రదర్శింపజేయడం.
- ◆ వందలకొద్దీ తెలుగు ప్రజలతో టెలిఫోన్‌లో హనీబీ గురించి చర్చించడం.
- ◆ 'వెలుగు', RIAD, EGS, NAARM, NIT, WASSAN, CSA, CWS లాంటి సంస్థలతో కలిసి పని చేయడం.
- ◆ గ్రామ ప్రజల సృజనాత్మక ఆవిష్కరణలకు, సాంప్రదాయ విజ్ఞాన శోధనకు జరిగే పోటీల గురించి పదివేల కరపత్రాలను రాష్ట్రమంతటా పంచడం.
- ◆ గ్రామీణ ఇన్నోవేటర్లకు ఉచిత సాంకేతిక మార్గదర్శకత్వానికి ముందుకు వచ్చిన ఎన్.ఐ.టి. వరంల్‌తో సంధానం. లాభపడిన అయిదుగురు తెలుగు ఇన్నోవేటర్లు.
- ◆ General Electric, India Innovation Centre, సికింద్రాబాద్‌లో ముగ్గురు ఇన్నోవేటర్ల ప్రదర్శన.
- ◆ పారిశ్రామిక వేత్తలు, అనధికార సంస్థలతో రాష్ట్ర ఉన్నతాధికారులు పద్మశ్రీ అనిల్ గుప్తా సమక్షంలో 12 మంది తెలుగు ఇన్నోవేటర్ల ఆవిష్కరణల ప్రదర్శన.
- ◆ ఒక ఆవిష్కరణ విస్తారానికి, టెస్టింగ్‌కు, ఐ.ఇ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.
- ◆ జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.
- ◆ మినీ శోధయాత్ర నిజామాబాద్ ప్రాంతంలో నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను కలుసుకుని వారి సృజనలను గురించి తెలుసుకోవటం.

ఈ స్థాయికి రావడానికి సంపూర్తిగా సహకరించిన ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారికి, ఎన్.ఐ.ఎఫ్. అహమ్మదాబాద్ సంస్థలోని ప్రతి ఒక్కరికి, పాత్రికేయులకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వేతర సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు, సృజనాత్మకత కలిగిన తెలుగు ప్రజలకు హనీబీ కృతజ్ఞతలు.


**మా కలలు :**

- ◆ ఆరవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- ◆ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి బహుమతులు రావాలని మనసారా ఆశించడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి – ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**– బ్రిగేడియర్ గణేశం,** కో–ఆర్డినేటర్,
హనీబీఏపి, ఫోన్ : 040–27118555

## హనీబీఏపి సారథులు



బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం



డా॥ కె.ఎల్. రావు



శ్రీ పి.సి. శర్మ

# పల్లెసృజన

సంపుటి-2 సంచిక - 1 జులై-సెప్టెంబర్ 2007



**సంపాదకవర్గం**

సంపాదకులు :
**డా. కె.ఎల్. రావు**

ఉప సంపాదకులు :
**శ్రీమతి అరుణ గణేశం**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. గీర్వాణి**
**డా. వై.వి. రావ్**
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**



డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040-30627739
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన -శ్రీమతి పి. అరుణ
102, వాయుపురి, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com


## ఈ సంచికలో...


- కల్పతరువు కలబంద (అలోవీర) 3
- భద్రతా అలారం 5
- జ్ఞానసముపార్జన దృక్పథం మారాలి 6
- మోటెక్ ట్రెడిల్ ప్రెస్, సెల్‌ఫోన్‌తో మోటార్ స్టార్ట్ 9
- చంద్రశేఖర్ 'దోమల మందు'కు ఎన్.ఐ.ఎఫ్. అండ 10
- ఆంధ్రప్రదేశ్‌లో 'హనీబీ' ప్రస్థానం 12
- ప్రపంచీకరణ నేపథ్యంలో వెలుగుబాట 'పల్లెసృజన' 16
- చేనేతలో నూతన పద్ధతి, క్రచ్‌తో నడక సులభం 17
- పల్లె తూకాల పరిజ్ఞానం 18
- సామాన్య రైతుల్లో అసామాన్య ఆలోచనా సరళి 19
- తుఫాన్లకు ఎదురొడ్డి నిలిచిన నీలగిరి 21
- భద్రాచలం వ్యవసాయంలో ఉపయోగించే పనిముట్లు 23
- పుట్టించలేని నీటిని కాపాడుకుందాం 25
- స్పందన 27


**కవర్ లోపలి పేజీల్లో :**

హనీబీఏపి ప్రగతి

చిన్నకారు రైతులకు వరం 10 హెచ్.పి. ట్రాక్టర్


## Honey Bee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : Dr. K.L. Rao, on behalf of "Honey BeeAP" 102, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.

# సంపాదకీయం

'పల్లెసృజన' దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని పల్లె పల్లెకు చొచ్చుకుపోతున్నందుకు మాకెంతో సంతోషం, తృప్తి కలుగుతున్నది. పాఠకులు ఈ పత్రికను అధిక సంఖ్యలో ఆదరిస్తున్నందున చందాదారుల సంఖ్య కూడా పెరుగుతున్నది. జీవిత చందాదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

హనీబీఏపి కార్యక్రమాలు కూడా విస్తృత స్థాయిలో వృద్ధి చెందుతూ, ఇన్నోవేటర్లను గుర్తిస్తూ గ్రామీణ ప్రాంతాలలోని సృజనాత్మక శక్తుల్ని వెలికి తీయడంలో సఫలీకృతమౌతున్నందుకు మాకు ఎంతో సంతృప్తి కలుగుతున్నది. ఒకటి తర్వాత ఒకటి మైలు రాళ్ళు దాటుతూ హనీబీఏపి ముందుకు సాగిపోతున్నది. పేటెంట్ల రూపంలోగాని, యం.ఓ.యు.ల రూపంలోగాని, ఇన్నోవేటర్ల సృజనకు ఆర్థిక సహాయం చేకూర్చడంలోగాని సత్ఫలితాలను సాధిస్తున్నది. ఇప్పటివరకు ఒక పేటెంట్ పొంది మరో మూడు పేటెంట్లను పొందే దశలో కృషి చేస్తున్నది.

శ్రీకాళహస్తికి చెందిన శ్రీ చంద్రశేఖర్ ఆవిష్కరించిన దోమల సంహారక మందుకు ఎన్.ఐ.ఎఫ్. ఆమోదం లభింపజేసి, వారికి రూ. 85,000/-ల ఆర్థిక సహాయం అందజేయడం హనీబీఏపి కృషికి తార్కాణం అని చెప్పవచ్చు. ఈ సంస్థచే వెలికి తీయబడ్డ శ్రీ లింగబ్రహ్మం గారి గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టె, శ్రీ నర్సిహాచారి 'తెల్లకాంతి విప్లవాన్ని' తెచ్చే ట్యూబ్‌లైట్లు త్వరలోనే మార్కెట్‌లోకి వస్తున్నాయి. శ్రీ నర్సింహాచారి ట్యూబ్‌లైట్లు దాదాపు 60 గ్రామాల్లో, 3 మున్సిపాలిటీల్లో విక్రయించడం జరిగింది.

ప్రస్తుతం సంచిక కొబ్బరి పరిశ్రమకు అంకితం చేయబడింది. ఆ పరిశ్రమలోని మెళకువలు, విషయ పరిజ్ఞానాన్ని ఇందులో పొందుపర్చడం జరిగింది.

చివరిగా....

"పల్లెసృజన"ను ఆదరించి, ప్రోత్సహిస్తున్న పాఠక లోకానికి మా ధన్యవాదాలు. పాఠకులు అధిక సంఖ్యలో చందాదారులుగా చేరితే మాకెంతో ప్రోత్సాహం, చేయూతనిచ్చినట్లు భావిస్తాము. పల్లెప్రజలకు సంబంధించిన వివిధ రకాల వ్యాపారవేత్తలు కూడా ఈ పత్రికను గురించి తెలుసుకుని తమ వ్యాపార ప్రకటనలతో పత్రికను ప్రోత్సహించి, గ్రామాభ్యుదయమే పరమావధిగా పనిచేస్తున్న హనీబీఏపి సంస్థను ఆశీర్వదిస్తారని ఆశిస్తాము.

భవదీయ

**కె.ఎల్. రావు**

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం. -సంపాదకవర్గం

అనుభవం

# కల్పతరువు కలబంద

## (అలోవీర)

– డా. జె. కనకదుర్గ, సింగరేణి మహిళా కళాశాల, కొత్తగూడెం

ఆరోగ్యానికి అపర ధన్వంతరి 'కలబంద' అంటే అతిశయోక్తి కాదు. 'అలోవీర' వృక్షశాస్త్ర (బొటానికల్) నామధేయం. అదొక కల్పదరువు. కోసిన చాలా రోజుల వరకు వాడని పత్రాలు, వీడని విచిత్ర ఔషధ ప్రభావం కలది. అజరామరత్వానికి అమృత భాండం వంటిదని భావించవచ్చు.

వ్యక్తిగత పరిశీలన, పరిశోధనల ఫలితాలను ఆధారంగా చేసుకొని కలబందతో గల సంబంధాన్ని, ఆరోగ్య బంధాన్ని, అనుభవాలను 'పల్లెసృజన' ద్వారా పాఠకులకు అందించాలన్న భావనే ఈ రచనకు మూలం.

మూడు సంవత్సరాల క్రితం కలబంద గురించి తెలుసుకోవటం జరిగింది. కుటుంబం లోని వ్యక్తికి 'సోరియాసిస్' అనే చర్మవ్యాధి వచ్చింది. అల్లోపతి మందుల వల్ల తాత్కాలిక ఉపశమనం ఉండేది. తెలిసిన వారివల్ల కలబంద ఆకులోని జెల్లీని పై పూతగా రాస్తే తగ్గుతుందని తెలుసుకొని ఆ ఆకులను సంపాదించి రోగి తలలోని బుడిపెల వంటి సోరియాసిస్‌కి రాయడం జరిగింది. 10 నిమిషాలకు ఆ బుడెలన్నీ మెత్తబడటం జరిగింది. వృత్తిరీత్యా ఆ రసాన్ని తలకు పట్టించుకోవటానికి వీలయిన సమయం దొరకక పోవటంతో పాటు ఆ వ్యక్తి దానిపై అంతగా నమ్మకం లేక కొనసాగించటం జరుగలేదు. ఐతే రాసుకున్న ఒకటి రెండుసార్లు స్నానం చేసేటప్పుడు ఆ ఆకులు స్నానాల గదిలో పడటంతో రోజూ డ్రైనేజి మోరీనుండి రాత్రిపోట చీకట్లో బయటకు వచ్చే బొద్దింకలు స్పృహతప్పి పడిపోవటం గమనించటం జరిగింది. మొదటి సారి అంతగా నమ్మకపోయినా రెండవసారి కలబంద ఆకులు పడ్డ స్నానాల గదిలోకి వచ్చిన బొద్దింకలు నిర్వీర్యమవటం గమనించటంతో చాలా ఆశ్చర్యాన్ని కలిగించి ఒక ఆలోచన కల్గింది. అది మనసులో ఏర్పరచుకొన్న సూక్ష్మమైన పరిశీలన జ్ఞానం. అనుకోకుండా మరొక ఇంటికి మారటం జరిగింది. ఒకనెల రోజుల నుండి ఆ యిల్లు ఖాళీగా ఉండటంతో వంటింటి అలమార్లలో బొద్దింకలు బాగా చోటు చేసుకుని పిల్లలను పెట్టడం జరిగింది. కొత్తగా సున్నం వేసిన చోట్ల కూడా కింది గూళ్ళలోని సందులలోకి బొద్దింకలు బాగా ఉన్నాయి. 'మార్టిన్' వంటివి వేసినా పూర్తిగా చావక మళ్ళీ విజృంభించాయి. అప్పుడు మళ్ళీ మనసులో వున్న జ్ఞానం మళ్ళీ స్పందన నివ్వటంతో ఆ కలబంద ఆకును మళ్ళీ తెచ్చి ఆ ఆకుల ముక్కలను చచ్చిపోయినవి, కొన్ని స్పృహ తప్పిపోయాయి. అంతేగాక, మళ్ళీ ఆకువున్న ఆ గూట్లోకి బొద్దింకలు రాలేదు. అప్పటినుండి బొద్దింకలు తిరుగుతుంటే దాని దగ్గరకు కలబంద ఆకును తీసుకెళుతుంటే ఒక మూడడుగుల ఆరా (అమృత ప్రదేశం) నుండి పరారవటం గమనించడం జరిగింది.



విజయవాడలో సోదరి పప్పు దినుసులతో పాటు నెలవారీ 'మార్టిన్' పొడరు డబ్బా తెచ్చి చల్లాల్సిందే. అయినా ఆ పొడరు వేసిన ఇమ్యునిటీని పెంచుకొని చావటం లేదు. అని తన బాధను చెప్పుతుంటే వెంటనే కలబంద ఆకునిచ్చి పెట్టమనటం జరిగింది. అలా పెట్టినప్పుడు అందులోని బొద్దింకలు నిర్వీర్యం అయి స్పృహ లేకుండా పడిపోయాయని చెప్పింది. మార్టిన్ వంటి పొడర్లు చల్లడం వల్ల మనం తినే పదార్థాలమీద గాలికి పడటమో లేదా త్రాగునీటిలో పీల్చే గాలి ద్వారా ఆరోగ్యానికి ధాతువులు మన శరీరంలోకి వెళ్ళే అవకాశం వుంది. అదే కలబంద ఆకును పెట్టడం వలన బొద్దింకలు పారిపోవటమే గాక మన ఆరోగ్యంమీద ఎటువంటి హానికర ప్రభావం ఉండదు. అంతేగాక ఆ ఆకు ఆర్నెల్లయినా వాడకుండా ఉండి అక్కడికి మరే యితర క్రిములను కూడా దరిచేరనీయదు.

ఈ ప్రయోగం ఇతర పాఠకులకు తెలియజేయడం చాలా సంతోషంగా వుంది. కలబంద ఆకుతో మరికొన్ని ప్రయోగాలు స్వీయానుభవాలు.


– పన్ను వదులయినచోట చేరిన ఇన్‌ఫెక్షన్ వల్ల పంటినొప్పి వచ్చింది. కలబంద ఆకును నమిలి ఆ నొప్పి పన్ను దగ్గర పెడితే ఐదు నిమిషాల్లో ఆ నొప్పి మటుమాయం అయింది.

పైగా ఎముకకు అంటుకొనే పంటి ప్రదేశం కొంత బలం చేకూరటం కూడా స్వీయానుభవం వల్ల అర్థమయింది.

– అల్లోపతి డాక్టరు ఫెరీ ఆర్థ్రైటీస్‌గా పేర్కొన్న చేతి భుజాల ప్రదేశంలో చేరిన విష వాయువుల నిలిపివేత ప్రభావంతో ఏర్పడిన మాధ మాత్రలు, వ్యాయామ చికిత్సల వల్ల తగ్గలేదు. అప్పుడు కలబంద లోని జెల్లీని తినటం చేత తగ్గిన విషయాన్ని గుర్తించటం జరిగింది.

– కలబంద జెల్లీ ఆకును తినటంచేత జీర్ణకోశం యొక్క పని విధానం మెరుగయి ఉబ్బెత్తుగా గట్టిగా వున్న కడుపులోని క్రొవ్వు కరిగి మనిషి సన్నబడటం గమనించిన విషయం.


– కంటసర్పిగా చెప్పబడిన 'హెర్పీస్' అనే వ్యాధి మెడచుట్టూ చిన్న పొక్కులు, దద్దుర్ల రూపంలో చిమచిమలాడుతూ మంట పుట్టటమే గాక మెడ నరాలలో పోటు వచ్చింది. ఇంట్లో జరిగే కార్యక్రమపు హడావుడిలో అంతగా పట్టించుకోలేదు. అయితే మూడవ రోజు గుంటూరులోని మెడికల్ కాలేజి రిటైర్డ్ ప్రన్సిపాల్ డా. సావిత్రి గారు చూచి 'నరాలు ఫ్లేర్ప్' అవటంచేత అది వస్తుందని, దానికి కనీసం 15 రోజుల పాటు యాంటీ బయోటిక్స్ వాడాలని సూచించింది. అయితే ఆ రాత్రి మరింతగా ఎక్కువవటంతో కలబంద ఆకులోని 'జెల్లీ'ని వ్రాస్తే అరగంటలో తగ్గి ఆ సర్పి వ్యాధి పొక్కులు మాడి వాడిపోవటం అనుభవయోగ్యం. అవి తగ్గినా మరలా నాల్గవ రోజు మరింతగా పెరుగుతూ లోపలి రోగం బయటకు వచ్చింది. భుజాలు కూడా కొద్దిగా నొప్పి వేయటం జరిగింది. మాత్రలు వాడాలనీ, 50 ఏళ్ళ వయస్సు వస్తే ప్రమాదమని అందరూ హెచ్చరిస్తున్నా బిజీ కార్యక్రమంలో పట్టించుకోలేదు. రాత్రిపూట మరింతగా పెరిగేది. వెంటనే జెల్లీ వ్రాసేదాన్ని. అయితే అలోవీరా జెల్లీని పూయటం చేత చర్మంలో ఎలాస్టిసిటీ తగ్గి ముడతలుగా వచ్చి గరుకుతనం తేలటంతో నెయ్యి వ్రాసి పొదరును అద్దేదాన్ని. తెల్లారేసరికి దురద పుట్టి బొబ్బలు మాడి రాలిపోవటం జరిగింది.



ఆ విధంగా పది రోజులకోసారి చొప్పున ఐదుసార్లు అలోవీరా జెల్లీని వ్రాసి ఆరిన తరువాత దానిమీద నెయ్యిని వ్రాసి, ఆ హెర్పీస్ లేదా కంఠ సర్పి పరిష్వంగం నుండి విముక్తి ఏర్పడింది. నా ఈ అనుభవాన్ని ఉపయోగించుకుంటే హెర్పీస్ తప్పకుండా తగ్గుతుందనీ, ఘంటాపథంగా చెప్పగలుగుతున్నాను. యాంటి బయోటిక్స్ వాడటంచేత రోగం తగ్గినా వచ్చే అనర్థాలు రకకాలు. కలబంద వైద్యం వల్ల రోగం తగ్గటమే కాక, మిగిలిన దుష్ఫలితాల బారిన పడకుండా కాపాడుకోవచ్చనీ తెలిసింది.


జనవరి 2006 వ సం.లో 'ఈనాడు' ఆదివారం పత్రిక లో కలబంద గురించి ఒక వ్యాసం చదవటం జరిగింది. విదేశాలలో దాన్ని 'లైఫ్ ఆఫ్ ప్లాంట్' అంటారనీ, దానిలో సోడియం, పొటాషియం, ఎ, బి, సి మరియు ఇ విటమిన్లు ఉన్నాయనీ (డి– విటమిన్ తప్ప), బి 2 పుష్కలంగా వుందనీ చదివి సంతోష పడ్డాను. పైగా చర్మ వ్యాధుల నుండి, కీళ్ళ వాతం నుండి మానసిక రుగ్మత నుండి తగ్గిస్తుందని వ్రాసారు. అయితే ఈ ఆకులలోని జెల్లీని రాత్రిపూట కంటే ఉదయం తీసుకుంటే మంచిది. అంతేగాక ఆకులోంచి తీసిన జెల్లీని వెంటనే లోపలికి తీసుకుంటే దాని ఉపయోగం ఉంటుంది అనుభవంలో తెలిసింది. 'ఈనాడు' పత్రిలో చదవటానికి ముందే స్వీయానుభవాలు ఏర్పడ్డాయి. నా అనుభవాలేవీ (ప్రత్యేకంగా పేర్కొన్నవి) వారి వ్యాసంలో వ్రాయలేదు. ఇవి నా స్వీయానుభవాలు. వీటిని మీతో పంచుకుంటున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ●

# టూ-ఇన్ వన్ టెక్నాలజీ




ఒక ఇంట్లో వున్న అందరూ ఒకే పౌడర్‌ను ఇష్టపడరు. ఒక్కొక్కరికి ఒక్కో ఫ్లేవర్ ఇష్టముంటుంది. కొందరు శాండల్ వుడ్ పౌడర్ వాడితే, కొందరు జాస్మిన్ పౌడర్ వాడతారు. అందుకొరకు రెండు పౌడర్ డబ్బాలను ఇంట్లో ఉంచుకోవడం సహజం. అలా చేయడం వల్ల ఇంట్లో ఎన్నో పౌడర్ డబ్బాలు కనిపించి కాస్త వెగటు కాకుండా ఇలా చేస్తే ఎలా ఉంటుంది?

ఒకే పౌడర్ డబ్బాను రెండు అరలుగా తయారు చేసి ఒక అరలో జాస్మిన్ పౌడర్, మరో అరలో శాండల్ వుడ్ పౌడర్ వేస్తే ఇద్దరికీ ఉపయోగకరంగా వుంటుంది. ఇంట్లో ఒకే డబ్బాలో ఇద్దరికీ కావలసిన పౌడర్ వుంటుంది. అలాగే సెంటు బాటిళ్ళు కూడా రెండు రకాల వాసనలు గలవి ఉండేట్లు తయారు చేయవచ్చు గదా!




ఇప్పటికే ఒక పెన్నులో రెండు, నాలుగు రంగుల ఇంకు గల రీఫిల్లు గల బాల్ పాయింట్ పెన్నులు మార్కెట్‌లో లభ్యమవుతున్న సంగతి అందరికీ తెలిసిందే.


-డా. చలం. ●

ఆవిష్కరణ


# భద్రతా అలారం



30 సంవత్సరాల వయసుగల అమీనుద్దీన్ ఎల్లప్పుడూ యంత్రాల పనితీరును మార్చుటలోను, కొత్త పరికరాలను కనుగొనుటలోనూ ఆసక్తి కనబరుస్తూ వుంటాడు. పిల్లవాడుగా వున్నప్పుడే ఇండ్లలో ఉపయోగించే 'దంపుడు రోలు' స్థానంలో అధిక సామర్థ్యంగల దంపుడు మిషన్ తయారు చేశాడు. తన సోదరుని రిఫ్రిజిరేటర్ రిపేరి షాపులో పనిచేస్తూ, తన సాంకేతిక సామర్థ్యాన్ని అభివృద్ధి పరచుకున్నాడు. ఇతను ఓ.ఎన్.జి.సి. లో ఎలక్ట్రికల్ కాంట్రాక్టరుగా పనిచేసేవాడు. అక్కడి సెక్యూరిటీ సిబ్బందికి అక్కడ పనిచేసే ఆయిల్ డ్రిల్లింగ్ మిషన్లు విపరీతమైన చప్పుడు తమ తోటి వారితో సమాచారాన్ని పంచుకోవటం కూడా అతి కష్టంగా ఉండేది. తమకు సహాయపడాలని వారు అమీనుద్దీన్ కోరడం జరిగింది. వారికోసమే అమీనుద్దీన్ ఒక పరికరం తయారు చేశాడు. ఈ పరికరం ద్వారా సబ్ స్టేషన్‌లో యిచ్చిన అలారం సిగ్నల్ మిగతా అన్ని సబ్ స్టేషన్‌లకే కాక, కంట్రోల్ టవర్‌కు కూడా చేరుతుంది. అంతేగాక "అలారం - టు - ఆల్" అనే కంట్రూల్ టవర్ అన్ని సబ్ స్టేషన్లకు దూరంగా వుండే స్పీకర్‌కు సంకేతాలు అందజేయ గలుగుతుంది. తక్కువ ఖర్చుతో తయారై, నమ్మకంగా పనిచే ఈ యంత్రం ఒకరినుండి మరొకరికి, ఒకరి నుండి అందరికీ ఒక చిన్న స్విచ్ నొక్కితే పని చేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతం గా పని చేస్తుంది.




ఓ.ఎన్.జి.సి. సంస్థ ఇలాంటి ఎన్నో యంత్రాలను తమ కర్మాగారంలో ఉపయోగిస్తున్నది. దానితో వారి భద్రత వ్యవస్థ పటిష్టపడి అందరూ సంతోషంగా ఉన్నారు. ●



# చీరల నేతలో కొత్త పద్ధతి

**50 సంవ. వయసుగల తమిళ నాడుకు చెందిన శ్రీ పి.యల్. భాను మూర్తి తన బాల్యంలో ఆయన, అతని కుటుంబ సభ్యుల చీరలు నేస్తూ జీవనం గడపడానికి పోరాటం చేసేవారు. అతను పెద్దయ్యాక చేనేత పద్ధతులను మెరుగు పరచడానికి తన సమయాన్ని వృత్తి కౌశల్యతని వినియోగించేవాడు.**


**చేనేతలో సాధారణంగా ఉపయోగించే పద్ధతిలో చీర అంచు డిజైన్, రంగులు మొత్తం చీర యొక్క రంగు డిజైన్‌లకు వేరుగా ఉంటుంది. ఈ పద్ధతి శ్రమతో కూడుకున్నది. ఇందులో మూడు నాడెలు వాడతారు. (నాడె మగ్గంలో ముందుకు వెనకకు కదలాడే పరికరం) అసలు నేతగాడు రెండు నాడెలు, అతని సహాయకుడు ఒక నాడెను వాడతారు.**



**అమెరికాలో తయారైన "క్యాచ్ కార్ట్ టెక్నిక్ డ్రాయింగ్ డివైస్ ఫర్ లూమ్" అనే పద్ధతి గమనించి భానుమూర్తి ఒక స్వయం చోదక నేత పద్ధతిని తయారు చేశాడు. ఇందులో నేతగానికి సహాయకుని అవసరం ఉండదు. ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుంది. ఈ యంత్రాన్ని మధురై జిల్లాలో స్థాపించి 15 మంది మహిళా చేనేత కారులకు "సేవా" సంస్థ సహాయంతో శిక్షణ ఇచ్చాడు.** ●

సందేశం

# సృజనాత్మక భారత నిర్మాణానికి
# జ్ఞాన సముపార్జన దృక్పథం మారాలి



– అనువాదం : డా. కె.ఎల్. రావు.

విలువిద్య రాజకుమారుల సొంతమే అని, ఇతరులు నేర్చుకోకూడదని ఆనాడు ద్రోణాచార్యులు ఏకలవ్యునికి విలువిద్య నేర్పడానికి నిరాకరించి అతనికి తీరని అన్యాయం చేశాడు. అయినా ఏకలవ్యుడు సహజ కౌశలంతో విలువిద్య నేర్చుకొని అజాత గురువైన ద్రోణుని వద్ద తన విద్య ప్రదర్శించినప్పుడు గురుదక్షిణ మిషతో అతని బొటన వ్రేలుని కోరడం యింకా అన్యాయం. అయితే ఈ కథ తరాల నుండి, యువతలో గురుభక్తిని పెంపొందించుటకు భారత దేశమంతటా ప్రచారం చేసి గంభీరమైన సాంస్కృతిక నేరం చేయడం జరిగింది. దీనికి మనమంతా బాధ్యులమే.

ఏకలవ్యునికి చెందిన గిరిజన సముదాయాలలో కనబడే అద్భుతమైన ఆలోచనా శక్తి, కల్పనా పటిమ, జ్ఞాన సముపార్జనలో ఆసక్తిని గుర్తించుటలో మనం విఫలమౌతున్నాం. ఏకలవ్యునివలె స్వయంకృషితో, గిరిజన సముదాయాలు సాధించిన అద్భుతాలు – మేనేజ్‌మెంట్ పరిజ్ఞానానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలలోగాని, సంఘంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలోగాని కనబడదు. ప్రస్తుతం ఏకలవ్యుని కథ మరియు సాటిలేని యోధుడు, దానగుణశీలి అయిన కర్ణుని కథ, ఇంకా ప్రపంచ వింతలలో ఒకటైన తాజ్‌మహల్ కట్టి తన చేతులనే మహారాజుచే బహుమతిగా పొందిన శిల్పి కథనాలు మీతో ముచ్చటించాలని వుంది. సమకాలీన భారతీయ వ్యవస్థ, విజ్ఞాన వ్యవస్థగా రూపాంతరం చెందుతున్న తరుణంలో పై మూడు కథనాలను ఉటంకించదలచు కున్నాను. తాము రాష్ట్రపతి కాక మునుపే గౌరవనీయులు, మాజీ రాష్ట్రపతి డా. ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారు భారత దేశాన్ని విజ్ఞాన వ్యవస్థగా రూపొందించే కమిటీకి అధ్యక్షత వహించటమే గాక, అట్టి వ్యవస్థ కొరకు భారతదేశపు కలలు సాఫల్యం కావాలని పదే పదే నొక్కి వక్కాణిస్తూ వుంటారు. మనదేశాన్ని విజ్ఞాన వ్యవస్థగా రూపొందించుటలో యువతరపు ఆసక్తి, వారి కల్పనా పటిమ గురించి డా. కలాంగారు తమకు లభించిన ప్రతి సందర్భంలోను ప్రస్ఫుటింపజేస్తూనే వుంటారు. మూల స్థాయిలో వున్న అన్ని వయసుల సామాన్య ప్రజానీకం ఏవిధంగా కల్పనా శక్తి కలిగి వుంటారో డా. కలాంగారు అనేక సార్లు సోదాహరణ ప్రసంగాలు చేస్తుంటారు. కాని విజ్ఞాన సంపదను సమకూర్చుకునే ప్రస్తుత పద్ధతులుగాని, వ్యవస్థలుగాని క్రియాశీలంగా లేకుంటే భారతదేశాన్ని విజ్ఞాన వ్యవస్థగా మార్చే కలలు కలిగిపోక మానవు.

కావున భారతదేశాన్ని గురించి రూపొందించుకున్న ఆలోచనల్ని గురించి పునరాలోచించాలి. ఇది చేయకుండా, విజ్ఞాన ఖనులై, ఆర్థికంగా అణగారిన బీద ప్రజానీకం తమ ఆకాంక్షలను ఫలింపజేసుకొనుటకు అవలంభించే పద్ధతులను ప్రశ్నించే హక్కు మనకుండదు. ఏకీకృత భారతదేశంలో ఏకలవ్యుని, కర్ణుని, అనామకులైన తాజ్‌మహల్ శిల్పుల ఆకాంక్షలను ఇముడ్చుకోక తప్పదు. విజ్ఞానోత్పత్తికి, విలువల సమీకరణ, మూల స్థాయిలో వాటి విస్తరణ మొదలగునవి, ఆధుని విజ్ఞానోత్పత్తి కేంద్రాలతో అనుసంధాన పరచకుంటే సాంఘిక నిరసనలను ఆందోళనలను మనం తప్పు పట్టలేమనేదే నా సిద్ధాంతం. అయితే సంఘ బహిష్కృతులైన ప్రజలు ఈనాడు మన నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను పూర్తి స్థాయిలో పునర్నిర్మింపజేయక కేవలం రిజర్వేషన్ల ద్వారానే వృద్ధి చెందడానికి ఉత్సుకత చూపడం దురదృష్టకరం. కాని ఇది తప్పనిసరి పరిణామం.




నిజానికి మనదేశంలో తరతరాలుగా ప్రజల విజ్ఞానాన్ని, వారు తమ ఉజ్వల భవిష్యత్తు కొరకు కల్పించుకునే అవకాశాలను నిర్లక్ష్యం చయటం వల్లనే వామపక్ష అతివాద ఉద్యమాలు తలెత్తినవని చెప్పవచ్చు. నా దృష్టిలో అతివాద వామపక్షాల, నక్సలైట్ల సంఘ బహిష్కరణను రద్దు చేసుకోవచ్చు. విజ్ఞాన సముపార్జనలో నిరంతరం యువతను వేరు చేస్తుంటే వారిలో కోపతాపాలు రగలడం సహజమే కనుక వారిని తప్పు పట్టలేం. జాతీయ గ్రామీణ కార్యక్రమాల్లో ఉద్యోగ కల్పనకే కాక మానసిక వికాసం కొరకు కృషి చేసే విధంగా పునరాలోచించాలని మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గారు దేశాన్ని హెచ్చరిస్తూనే వుంటారు. అయితే వివిధ సంఘ సేవా కార్యకర్తలు, ఎల్లప్పుడు బీదల తరపున వాదించేవారు కలాంగారి ఈ హెచ్చరికలను పెడచెవిన పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

మహాభారతంలోని ఏకలవ్యుని

వృత్తాంతం అందరికీ తెలిసిందే. ఏకలవ్యుడు ఒక గిరిజన యువకుడు. తన మేధస్సును నిజ జీవితంలోకి అనువదించుకొనుటకు ఉబలాట పడేవాడు. విలువిద్యలో అతనికి ఆసక్తి మెండు. తనకున్న విలువిద్యా పాటవాన్ని మరింత మెరుగు పెట్టి ఉన్నత శిఖరాలకు చేరాలనే ఉత్సాహం కలిగిన వాడు.

ఆ కాలంలో ద్రోణాచార్యుడు విలువిద్యలో సాటిలేని మేటి. ఈ విషయాన్ని గుర్తించిన హస్తినాపుర రాజుకు, తమ పిల్లలకు విలువిద్య నేర్పుటకు ద్రోణాచార్యులను తమ ఆస్థాన గురువుగా నియమించుకున్నారు. ఆయన ఒక గురుకులం ఏర్పరచుకొని రాజకుమారులకు మాత్రమే విలువిద్య, యుద్ధ కౌశలం నేర్పుతుండేవాడు. పాండవ మధ్యముడైన అర్జునినిపై ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రపంచంలోకెల్లా శక్తివంతమైన విలుకానిగా చేయుటకు సంకల్పించుకున్నాడు.

ద్రోణాచార్యుల గురించి తెలుసుకున్న ఏకలవ్యుడు, గురుముఖంగా విలువిద్యలో ప్రావీణ్యం పొందాలనే ఆశయంతో ద్రోణాచార్యుని ఆశ్రయించాడు. అయితే ఏకలవ్యుడు రాజకుమారుడు కానందున, సామాన్య యువకుడైనందున, ద్రోణుడు ఏకలవ్యునికి తన ఆశ్రయంలో ప్రవేశం నిరాకరించాడు. దాంతో ఏకలవ్యుడు నిరాశతో వెనుదిరిగాడు. ఈ నిరాకరణకు దిగులు చెందక ద్రోణాచార్యుల ప్రతిమను ఒకదాన్ని ప్రతిష్ఠింప జేసుకుని ఆ ప్రతిమనే ప్రత్యక్ష గురువుగా భావించుకుని విలువిద్య అభ్యసించాడు.

తర్వాత కొన్ని సంవత్సరాల పిమ్మట ద్రోణాచార్యులు తమ శిష్యగణంతో సంభాషించు కుంటూ అడవి మార్గంలో పోవడం తటస్థించింది. వారి సంభాషణను ఆటంకపరిచే విధంగా ఒక కుక్క మొరగడం మొదలు పెట్టింది. దూరంనుండి ఇది విన్న ఏకలవ్యుడు కుక్కని చూడకుండానే, ధ్వనిని బట్టి బాణాలను సంధించిన కుక్క నోటిని కట్టి పడేశాడు. ఈ సంఘటన చూసిన ద్రోణాచార్యులు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయి, ధ్వనిని బట్టి శరసంధానం చేసే విలుకాడు కూడా వుంటాడని నమ్మలేకపోయాడు. అతనెవరో తెలుసుకోవాలనే ఆసక్తితో వెతకడం ప్రారంభించాడు. ఆ క్రమంలో ఒక ప్రజ్ఞాశాలి అయిన విలుకాడిని చూస్తానని ఆశించని ఆయనకు ఒక గిరిజన బాలుడు కనిపించడంతో ఖంగుతిన్నాడు. ఆ షాక్‌నుండి తేరుకుని 'నీవెవరవు, నీ గురువెవరు?' అని ఏకలవ్యుని ప్రశ్నించగా, తన గురువు ద్రోణాచార్యులని, అతని వద్ద విలువిద్య నేర్చుకోవడం ఏ విధంగా సాధ్యమైందో వివరంగా తెలిపాడు. అది విన్న ద్రోణుడు ఒక్కక్షణం ఆలోచించి, నన్ను నీ గురువుగా భావిస్తే నాకు గురుదక్షిణగా నీ కుడిచేతి బొటన వ్రేలుని కోసిమ్మని అడిగాడు. ఏకలవ్యుడు తక్షణం తన బొటన వ్రేలిని కత్తితో నరికి ద్రోణాచార్యుల పాదాల వద్ద సమర్పించుకున్నాడు.

శక్తివంతమైన ఈ కథను 'గురుభక్తి'కి ప్రతీకగా తరతరాలుగా మన సమాజం ఆమోదిస్తున్నది. కాని, ఆ కథ వెనుక దాగివున్న వివక్షత విషాదం మనకు తెలియదు. తెలిసినా గుర్తుంచుకోము. ఒక దళిత యువకుడు జ్ఞాన సముపార్జనకు వెలిగించుకొన్న జ్యోతి 'గురుభక్తి' ముసుగులో శాశ్వతంగా ఆరిపోయింది. అంతేగాక అతని జ్ఞాన సంపదను తోటి యువకులకు పంచిపెట్టే అవకాశం పూర్తిగా అడుగంటిందని మనలో ఎందరం ఊహించుకో గలుగుతున్నాం.

గురుదక్షిణగా బొటన వ్రేలుని కోరుటలో ద్రోణాచార్యుల అంతర్యమేమై వుంటుందని ప్రతి సంవత్సరం నా విద్యార్థులను ప్రశ్నిస్తూ వుంటాను. వారు రకరకాలైన జవాబులు చెబుతుంటారు. అయితే ద్రోణాచార్యులు బొటన వ్రేలు కావాలని కోరగానే ఏకలవ్యుని మనోభావాలేమిటని కూడా అడిగితే, ఒకే ఒక జవాబు వస్తుంది. 'గురువాజ్ఞ పాటించాలనేదే ఏకలవ్యుని భావన'.

ఇలాంటి సాంప్రదాయాలు, పౌరాణిక గాథలు, వాటి అర్థ తాత్పర్యాలు ఒక తరం నుండి మరొక తరానికి ఏదోఒక విధంగా అందింప బడుతూనే వున్నాయి.

నేను చెప్పాలనుకొన్న మరొక పౌరాణిక గాథ కర్ణుడిది. ఇదికూడా అందరికీ తెలిసిందే. కర్ణుడు, పాండురాజు పట్టపు రాణి కుంతీదేవికి, ఆమె కన్యగా ఉన్నప్పుడు పుట్టిన పుత్రుడు. సంఘానికి వెరసి, ఆ పసికందును గంగానదిలో వదలడం, ఆ బాలుడు దాశరాజు వద్ద పెరగడం మనందరికీ తెలిసిందే. కర్ణుడు చురుకైన విద్యార్థి. విజ్ఞాన సముపార్జనలో శ్రద్ధ కలవాడు. విలువిద్యలో ఆసక్తి కలిగి, క్షత్రియ ద్వేషి అయిన పరశురాముని ఆశ్రయిస్తాడు. తను బ్రాహ్మణ బాలునిగా పరిచయం చేసుకుని విద్య పూర్తి చేసుకుంటాడు. ఆ సందర్భంలో ఒకనాడు పరశురాముడు కర్ణుని తొడపై నిద్రిస్తుండగా,



కర్ణుని తొడకింద కుమ్మరి పురుగు ఒకటి చేరి తొడను తొలుస్తూ వుంటే రక్తం ప్రవహిస్తూ పరశురాముని శరీరాన్ని తాకుతుంది. దాంతో పరశురాముడు మేల్కొని, ఇంత బాధ భరిస్తూ కదలకుండా వున్నాడంటే ఇతడు బ్రాహ్మణుడు కాదని క్షత్రియుడని గ్రహించి, ఆగ్రహించి, శపిస్తాడు. తను నేర్పిన విలువిద్యా జ్ఞానం కర్ణునికి అవసరమున్నపుడు మరచిపోతాడనే శాపం పెడతాడు. పర్యవసానంగా కర్ణుడు యుద్ధభూమిలో, తనకు వచ్చిన విద్యనంతా మరచిపోయి చంపబడతాడు. ఈ కథ ఏ విధమైన జ్ఞానానికి ప్రతీకగా తోస్తున్నదో మనకు తెలుస్తూనే వున్నది.


నేను చెప్పదలచుకున్న మూడవ కథ తాజ్‌మహల్ నిర్మించిన శిల్పులది. దాదాపు 500 సంవత్సరాల క్రితం షాజహాన్ చక్రవర్తి తన ప్రేయసి జ్ఞాపకార్థం విశ్వ విఖ్యాత కళాసంపద, తాజ్‌మహల్ పేరుతో నిర్మింపజేశాడు. తాజ్‌మహల్‌ను, ప్రేమకు చిహ్నంగా జ్ఞాపకాలకు ప్రతీకగా, తరతరాలుగా ప్రపంచమంతటా కొనియాడబడుతున్నది. కాని, తాజ్‌మహల్ నిర్మాణం వెనుక ఎంత విషాదం దాగివున్నదో మనలో కొందరికే తెలుసు. ఈ కట్టడం వివక్షతను, సార్వభౌమాధికారాన్ని, క్రూరత్వాన్ని, నిరంకుశత్వాన్ని చాటి చెబుతున్న సత్యం అని చాలామంది ఆమోదించరు.

తాజ్‌మహల్ కట్టిన శిల్పులు తమ జీవిత సమయాన్ని ధారబోసి, సంవత్సరాలుగా కఠోర కృషి చేసి, ఊహలకే అందని అతి విలువైన నిర్మాణం నిర్మించే క్రమంలో, ఎన్నో అనన్య సాధ్యమైన అనుభవాలను, శిల్పకలలో మెలకువలను నేర్చుకొని వుంటారు. వారి పిల్లలు, వారి ఇరుగు పొరుగు వారు ఆనాటి సమాజంలోని సభ్యులు ఈ జ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగు పరచుకోవాలని ఆశించి వుంటారు. కాని, ఆ విధంగా జరగలేదు. షాజహాన్ తన ఆధికృతను చాటుకోవడానికి, తను రూపకల్పన చేసిన కట్టడానికి శాశ్వత ఖ్యాతి కలిగించడానికి, అట్లాంటి నిర్మాణం ఇంకొకటి నిర్మించకుండా ఉండటానికి తాజ్‌మహల్ నిర్మాణం చేసిన ప్రధాన శిల్పుల రెండు చేతులు తెగనరికించాడట. ఆహా!! అంకిత భావానికి రాజభక్తికి ఎంత గొప్ప కానుక?!!!

ఈ విధంగా జ్ఞానాన్ని హరింపజేసి, వివక్షతకు గురి చేసిన అసాధారణ సాంప్రదాయాల గురించి, జ్ఞానాన్ని పంచే ప్రసంగాలు ఎందుకు మాట్లాడరో అర్థం కాదు.

ఈ నేపథ్యంలో, సృజనాత్మకత కలిగి, దయార్ద్ర హృదయాలుగల వ్యక్తుల మధ్య సహాయ సహకారాల సంస్కృతి పెంపొందించాలని, హనీబీ, 'సృష్టి', ఎన్.ఐ.ఎఫ్. మరియు ఇతర తోటి సంస్థలు కనే కలలు ఏ విధంగా సఫలం అవుతాయో అర్థం కాకుండా వుంది.

జ్ఞాన సంపదను తమవరకే కాపాడుకునే ఆచారం అనాదిగా మన దేశంలో వున్నదే.



తమ జ్ఞానాన్ని ఇతరులకు తెలియజేస్తే దానికుండే శక్తి పోతుందని వారి అపోహ. అయితే తమ జ్ఞానాన్ని ప్రతిఫలాపేక్ష లేకుండానే ఇతరులతో పంచుకునే సత్సాంప్రదాయం కూడా మనదేశంలో వున్నది. వారు తమ జ్ఞానాన్ని ఇతరులతో ప,చుకుంటూ అవసరమైన చోట ఆచరణలో పెడుతూ సమాజానికి ఉపయోగపడు తుంటారు. ఇందుకు చిన్న ఉదాహరణ గ్రామాలలోని వైద్యులు, తాము స్వయంగా దారిద్ర్యంలో మగ్గుతున్నా, ఇతరుల రుగ్మతలు నయం చేస్తుంటారు. వారు చూపే ఈ ధాతృత్వానికి ప్రతిఫలం అందించుటకు సమాజం సరైన విధానాలను రూపకల్పన చేయడం లేదు.

మతపరమైన సంస్కృతికి చెందిన, మరే యితర కారణాలకు సంబంధించిన వారైనా వ్యాపార రహస్యాలు ప్రతి సమాజంలోనూ వుండడం గమనిస్తూనే వుంటాము. ఇలాంటి సంక్లిష్టమైన జ్ఞాన సంపదను గుర్తించి, సేకరించి, భద్రపరచుకోవలసి వుంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మన సమాజం ఇతరుల నుండి ఔదార్యం, విశాల బుద్ధి ఆశిస్తుందే కాని వాటిని తిరిగి ఇవ్వడానికి సిద్ధంగా ఉండదు.

జ్ఞాన సముపార్జనకు ఉత్సహపడేవారు, తాము పొందిన జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవాలని ఉబలాటపడేవారు ఎప్పుడూ నిరాశకు గురవుతూనే వుంటారు. వారివద్ద వుండే జ్ఞాన సంపదకు విలువగట్టి కాపాడటం అనేది అటుంచి, అట్టి సంపద గుర్తింపుకే నోచుకోవడం లేదు. కనుకనే మన దేశంలోని 25 కోట్ల బీద యువకులు 'ఉపాధి కల్పనా పథకాల' పేరుతో కాయకష్టాల వృత్తులలోనే వినియోగించబడుతున్నారు.

నేడు మన దేశంలో మూడువంతుల ప్రజలు తమ న్యాయ సమ్మతమైన హక్కులు పొందగలిగే స్థితిలో లేరు. కనుక మొత్తం సమాజాన్ని కలుపుకుపోయే దిశలోనే జ్ఞాన సముపార్జన కృషి జరగవలసి వుంటుంది. ఉత్సాహవంతులై, అవకాశాలు దొరకక, కోపోద్రిక్తులు అవుతున్న యువతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ, జ్ఞాన సముపార్జన కేంద్రాలు వాటి దృక్పథాలను పునర్ నిర్వచించే కార్యక్రమానికి ఏమాత్రం జాప్యం చేసినా అది చెడు ఫలితాలకు దారి తీస్తుంది. ●

కొత్తదనం

# మోటెక్ ట్రెడిల్ ప్రెస్



ఇరవై ఎనిమిది సంవత్సరాలు శ్రీ సతీశ్‌దేవ్ ఒక సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి. తన ఇంట్లో ఉన్న కాలితో నడిపించే ప్రింటింగ్ ప్రెస్ గురించి అన్ని విషయాలు తెలుసుకున్నాడు.

ప్రస్తుత కాలంలో మార్కెట్‌లో వెలసిన కంప్యూటర్‌లు మరియు ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే ప్రింటింగ్ యంత్రాల తాకిడికి తమ ఇంట్లో వున్న కాలితో నడిచే ప్రింటింగ్ యంత్రాల పరిశ్రమ పూలపడి కుటుంబ ఉపాధి కోల్పోకుండా ఉండటానికి సతీష్ ఆలోచించసాగాడు. కాలితో నడిచే ప్రింటింగ్ యంత్రాన్ని నూతన మార్పులతో వాడుకలోకి తేవడానికి ఒక పరిజ్ఞానాన్ని ఇతడు రూపొందించాడు.

పాత ప్రింటింగ్ యంత్రాలను కొత్త పద్ధతిలో తయారు చేయడానికి మోటెక్ అనే కటింగ్ ఎడ్జ్‌ను ఉపయోగించి ఒక ప్రింటింగ్ యంత్రాన్ని తయారు చేశాడు. స్క్రీన్ ప్రింటింగ్ మరియు కంపోజింగ్ (అక్షరాలు కూర్చడం) ప్రింటింగ్ చేసే పద్ధతులను కలిపి పనిచేసే విధంగా ఈ కొత్త యంత్రం పని చేస్తుంది. కొత్త ఆఫ్‌సెట్ ప్రింటింగ్ కొన్నదానికన్నా ఈ యంత్రం తక్కువ ఖర్చుతో తయారవుతుంది. అంతే కాక కాలితో నడిచే యంత్రంకన్నా ఐదు రెట్లు అధిక సామర్థ్యం కలిగి వుంటుంది.





# సెల్‌ఫోన్‌తో మోటర్ స్టార్ట్





**28 సంవత్సరాల ప్రేమ్‌సింగ్ తన 14 సంవత్సరాల వయసునుండే కొత్త పరికరాలను ఉత్పత్తి చేయడంలో నిమగ్నమై తన చదువు కూడా మానేయడం జరిగింది.**

**ఆయన వద్ద వున్న సెల్‌ఫోన్ (మొబైల్ ఫోన్)తో ఎక్కడో దూరంగా వున్న కరెంట్‌తో నడిచే యంత్రాలను ఆన్, ఆఫ్ స్విచ్‌లను పని చేయించగలుగుతున్నాడు. ఈ పరికరం ద్వారా రైతులు దూరంగా ఉండే తమ కరెంట్ పరికరాల స్విచ్‌లను ఆన్, ఆఫ్ చేయగలుగుతున్నారు. దీనివల్ల వారు తమ యంత్రాలను తమ ఇష్టమున్న రీతిలో నియంత్రిస్తూ ఇష్టమున్న చోటికి పోగలుగుతున్నారు.**

**ఈ పరికరం చాలా తక్కువ ధరలో తయారై ఇంకా ఎన్నో అవసరాలకు ఉపయోగపడుతున్నది.**

**ఆసియా ఇన్నోవేషన్ అవార్డ్ సంస్థ వారు ఈ పరికరానికి అవార్డు ప్రదానం చేశారు.**

ప్రోత్సాహం

# చంద్రశేఖర్ 'దోమల మందు'కు ఎన్.ఐ.ఎఫ్. అండ

– **స్వాతి,** రీసర్చ్ అసిస్టెంట్

చిత్తూరు జిల్లా కారాకొల్లు గ్రామ నివాసి చంద్రశేఖర్ గారి 'దోమల మందు'కు ఎన్.ఐ.ఎఫ్. గుర్తింపు లభించింది. ఈ ఇన్నోవేషన్ వివరాలు పల్లెసృజన ఆగస్ట్ – అక్టోబర్ సంచిక (3–5 పేజీలు) లో ప్రచురించడం జరిగింది. నల్లమల అడవుల్లో విరివిగా పెరిగే తెల్లజమ్మి తీగ చెట్లనుండి రాబట్టిన ద్రావకం 'లార్వా'ను సంపూర్ణంగా నాశనం చేస్తుందని పరిశోధనా శాలలో నిరూపించ బడింది. ఈ విషయం ఎన్.ఐ.ఎఫ్. అహమ్మదా బాద్ వారు హనీబీఏపికి తెలియజేశారు.


హనీబీఏపి కారాకొల్లు దోమల మందును అందరికీ లభ్యం చేయాలన్న ఉద్దేశ్యంతో ఒక బిజినెస్ ప్రపోజల్‌ను ఎన్.ఐ.ఎఫ్.కు పంపించింది. దీనికి సంపూర్ణంగా స్పందించిన ఆ సంస్థ రూ. 85 వేలను వడ్డీలేని రుణంగా ఇవ్వడం జరిగింది. ఈ ధనాన్ని 'లార్వా' ను చంపే ద్రావకం ఉత్పత్తి, మార్కెటింగ్ లకు వినియోగించుకుని ఆ గ్రామ అభివృద్ధికి అందరూ పాటు పడాలని ఎన్.ఐ.ఎఫ్. కోరుతోంది.



ఈ రెండు శుభవార్తలను శ్రీ చంద్రశేఖర్ గారికి వారి పరిశోధనా బృందానికి స్వయంగా అందజేయాలన్న ఆశయంతో బ్రిగేడియర్ గణేశం, జాగర్లమూడి దుర్గాప్రసాద్, క్రాంతికిరణ్ కారా కొల్లు గ్రామానికి పయనం కట్టారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో డిసెంబర్ ఒకటిన సుప్రభాత వేళ శ్రీకాళహస్తి చేరుకున్నారు. రైల్వే స్టేషన్లో చంద్రశేఖర్, మత్తినాయుడుల హృదయ పూర్వక స్వాగతంతో దేవాలయ అతిథి గృహంలో స్నాన పానాదులు ముగించుకుని ప్రథమంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శించు కున్నారు. స్థానిక సంఘ సేవకుడు శ్రీ వెంకట్రావు గారు హనీబీఏపి టీముకు అన్ని సౌకర్యాలు సమకూర్చారు.

ఇక చంద్రశేఖర్ బృందం సరేసరి. రోజంతా తోడుగా వున్నారు. దగ్గరుండి గ్రామం చూపించారు. అతి శ్రద్ధగా వారి ఇన్నోవేషన్లను, పరిశోధనలను వివరించారు. స్వయంగా భోజనాలు వడ్డించారు.

పదకొండు గంటలకు కారాకొల్లు గ్రామం చేరుకున్నారు. గ్రామవాసులు హనీబీఏపి బృందానికి చిరునవ్వుతో స్వాగతం పలికారు. ఆ ఊళ్లోని పాఠశాల ఉపపాధ్యాయులు, చిన్నారులు నించొని ఒకే గొంతుతో నమస్కారాలు తెలిపారు. ఆ తర్వాత 'స్నేహశీల' ప్రయోగం గురించి వివరించారు. ఈ ప్రయోగం ద్వారా చిన్నారులు తయారు చేసిన ప్రాజెక్టు రిపోర్టులు చూసి హనీబీఏపి బృందం ఎంతో సంతోషించింది. చిన్నారుల ప్రతిభను వెలికి తీయడంలో అసాధారణ కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. గ్రామంలోని వారంతా చంద్ర శేఖర్ గారిని ప్రేమగా 'చంద్రన్న' అని పిలుస్తారు. సైన్సు మానవ ప్రగతికి ప్రధానమని ఆయన భావిస్తారు. తాను ఎన్నో ప్రయోగాలు చేస్తూ, ఇతరులను ప్రోత్సహిస్తూ, చిన్నారులకు మార్గదర్శకత్వం చేస్తూ, స్వలాభాపేక్ష లేకుండా కారాకొల్లు గ్రామంలో గత రెండు దశాబ్దాలుగా సరళ జీవితాన్ని కొనసాగిస్తున్నారు.



హనీబీఏపి బృందానికి తమ ప్రయోగశాలలో తోటి ఇన్నోవేటర్లు భాస్కర్, మురళి, బత్తినాయుడు, చిరంజీవి, వెంకటేశ్వర్లు తదితరులు తమ అనేక ప్రయోగాలను గురించి

అతిథులందరికీ వివరంగా తెలిపారు. సహజ వనరుల నుండి సాగిస్తున్న వారి అనేక ప్రయోగాలు అద్భుత సృజనాత్మక శక్తికి ఫలితాలు అనిపించాయి. ఈనాడు స్థానిక ప్రతినిధులు, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ నాయుడు గారు రీసెర్చ్ అసిస్టెంట్ స్వాతి, హనీబీఏపి బృందం, చంద్రశేఖర్ బృందం కొనసాగిస్తున్న ప్రయోగాలను ప్రశంసించారు.

ఊరిమధ్య చెట్లక్రింద నీడలో కూర్చున్న గ్రామస్తులను సంభోదిస్తూ బ్రిగేడియర్ గణేశం 'చంద్రశేఖర్ ఒక ఉత్తమ సృజనాత్మక వ్యక్తి అని, ఆయన ఆధ్వర్యంలో వారి బృందం విజయ వంతంగా కనిపెట్టిన 'తెల్లజుమ్మి' నుండి తయారు చేసిన తైలం లార్వాను సంపూర్ణంగా చంపేస్తుం దన్న నిరూపణ ఎన్.ఐ.ఎఫ్. నుంచి లభించిందని' తెలిపారు. ఎన్.ఐ.ఎఫ్. వారు పంపిన సర్టిఫికెట్‌ను గ్రామస్తుల కరతాళ ధ్వనుల మధ్య చంద్రశేఖర్ గారికి అందించారు. ఈ తైలాన్ని మార్కెట్ చేయడానికి కావలసిన బిజినెస్ ప్లాన్ గురించి తెలుపుతూ బ్రిగేడియర్ గణేశం గారు మొదటి విడతగా 25 వేల రూపాయల చెక్కును చంద్రశేఖర్ గారి చేతిలో పెట్టారు. ఈ తైలాన్ని మార్కెట్‌లో ప్రవేశ పెట్టడానికి హనీబీఏపి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. కారాకొల్లు గ్రామస్తులు సంపూర్ణ సహకారంతో, వారి ప్రోత్సాహంతో మరిన్ని వినూత్న ఇన్నోవేషన్లను సమాజానికి సమర్పిస్తారని బ్రిగేడియర్ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, వారి ఆతిథ్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



శ్రీ దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ కారాకొల్లు గ్రామం ఒక ఆదర్శ గ్రామంగా మారాలని కోరారు. రసాయనిక ఎరువులు, మందులు వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని కోరారు. మొదట్లో పెట్టుబడి తగ్గినా, మూడేళ్ళలో గ్రామం ఆరోగ్యంగా, ఆనందంగా అభివృద్ధి పథంలో కళకళలాడుతుందని ఆశించారు.

ప్రేమతో, ఆప్యాయతతో చంద్రశేఖర్ తల్లి వేడి వేడి భోజనం వడ్డించగా, తండ్రి ఆదరంగా అందరితో మాట్లాడుతూ అందరూ సుష్టుగా భోంచేసేలా చేశారు. ఆరోజు సాయంత్రం పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో హనీబీఏపి బృందం తిరిగి రాష్ట్ర రాజధానికి బయల్దేరింది.



డిసెంబర్ మొదటి తేది చాలా ముఖ్యమైన దినం. హనీబీఏపి ఒక అజ్ఞాత తెలుగు ఇన్నోవేటర్‌ను వెతికి, వెలుగులోకి తీసుకువచ్చి, వారి ఇన్నోవేషన్లకు శాస్త్రీయ గుర్తింపును తెప్పించింది. ఒక గ్రామీణ శాస్త్రవేత్తను సత్కరించింది. ఎన్.ఐ.ఎఫ్. వారి సహాయంతో ఆ ఇన్నోవేషన్ సమాజానికి ఉపయోగపడేలా తమ ఉత్పత్తులను వ్యాప్తి చేయాలన్న ఉద్దేశ్యంతో మార్కెటింగ్ బాధ్యత కూడా తనే తీసుకుంది. ఉత్పత్తికి కావలసిన ఆర్థిక సహాయం కూడా అందించింది. ఇది ఒక చిన్న ముందడుగు. ఈ చిన్న అడుగే 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా తెలుగు దేశమంతటా ప్రాకాలని, మరెన్నో ఇన్నోవేషన్లను గ్రామాల్లో వెతికి, చంద్రశేఖర్ గారిలా వెలుగులోకి తేవాలని 'పల్లెసృజన' మనసారా కోరుకుంటోంది, ఆశిస్తోంది, ఇది తప్పక సాధ్యమవుతుందని విశ్వసిస్తోంది. ●

అవలోకన

# ఆంధ్రప్రదేశ్‌లో 'హనీబీ' ప్రస్థానం

- డా. కె.ఎల్. రావు

'హనీబీ'తో నా పరిచయం 2005వ సంవత్సరం చివరిలో జరిగింది. బ్రిగేడియర్ (రిటైర్డ్) గణేశం గారు ఎన్.ఐ.ఎఫ్. మరియు 'హనీబీ'ల గురించి ప్రస్తావిస్తూ, ఆ సంస్థల కార్యక్రమాలు మన రాష్ట్రానికి విస్తరించలేదని, అట్టి కార్యక్రమాలు ఇక్కడ ప్రారంభించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. వారి ఆలోచనకు అనుగుణంగా, ఈ విధమైన కార్యక్రమాల్లో ఆసక్తి కలిగిన కొంతమంది మిత్రులతో బ్రిగేడియర్ గణేశం గారి నేతృత్వంలో ఒక కూటమి ఏర్పడి, 'హనీబీఏపి' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో 'హనీబీ' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో సింగరేణి సంస్థలో ఉన్నత పదవిలో ఉన్న శ్రీ చంద్రకాంత్ శర్మ గారిని క్రియాశీలక పాత్ర పోషించాలని కోరగానే వారు ఆమోదించడం ముదావహం.

ఈ విషయం జాతీయ స్థాయి ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు తెలియజేయగా, వారు 'హనీబీఏపి' ఏర్పాటుకు తమ అంగీకారం తెలియజేయడం జరిగింది. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 'హనీబీఏపి' కి అంకురార్పణ జరిగింది.

ఈ సంస్థ కార్యక్రమాల్లో ముఖ్యమైనది మరుగున పడిపోతున్న పల్లెప్రజల సృజనాత్మక శక్తిని వెలికి తీసి, వారి ఆవిష్కరణలకు ఇతోధిక గుర్తింపు కలుగజేసి, వారి సంక్షేమానికి కృషి చేయడం ఈ సంస్థ మరొక కార్యక్రమం. 'హనీబీఏపి' కార్యక్రమాల గురించి పల్లె ప్రజల సృజనాత్మక శక్తిని, వారి ఆవిష్కరణలను గురించి అందరికీ తెలియజేయడం, ఇందుకొరకు ఒక పత్రిక ప్రచురించడం ఈ సంస్థ మూడవ కార్యక్రమం. సభలు, సమావేశాలు నిర్వహించి, ఆంధ్రప్రదేశ్‌లోని ఇన్నోవేటర్లను పెద్దలతో కలిపించి, వారిని ఉత్తేజ పరచడం.

'హనీబీఏపి' ఏర్పడ్డ రెండు సంవత్సరాల్లోనే సంస్థ స్థాపించిన ఉద్దేశ్యాలు నెరవేరినవనే తృప్తి మాకుంది. మొదటి ఏడాదిలోనే నలుగురు యువకులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ ఇన్నోవేటర్ల సదస్సులో గౌరవ సత్కారాలు లభించడం 'హనీబీఏపి'కే కాక తెలుగు వారందరికీ గర్వకారణం. కొంతమంది ఆవిష్కర్తలకు వారి ఇన్నోవేషన్లకు వ్యాపార రీత్యా గుర్తింపు లభించి, వారికి ఆర్థికంగా సహాయం కూడా లభించడం 'హనీబీఏపి' కృషి ఫలితమేనని చెప్పవచ్చు.

'హనీబీఏపి' కార్యక్రమాల్లో రెండవది అయిన పత్రికా ప్రచురణ, సంస్థ కార్యక్రమాలను ప్రతిబింభింపజేయడానికి జాతీయ స్థాయిలో 'హనీబీ' అనే పత్రిక ఆంగ్లముతో సహా ఆరు భాషలలో ప్రచురింపబడుతున్నది. ఇదే తరహాలో తెలుగులో కూడా ఒక పత్రిక నడపాలనే ఉద్దేశ్యంతో 'పల్లెసృజన' పేరుతో 2006వ సంవత్సరం మే నెలలో ఒక త్రైమాసిక పత్రికను ప్రారంభించడం జరిగింది. ఆధార రహిత సాంకేతిక విజ్ఞానాన్ని, వినూత్న ఆలోచనలను మాతృభాషలో పల్లె జనులకు అందజేయడం ఈ పత్రిక ఉద్దేశ్యం. ఈ పత్రిక ద్వారా దేశంలో నలుమూలల్లో ఉన్న సామాన్య ప్రజానీకంచే ఆవిష్కరింపబడిన ఇన్నోవేషన్లు తెలుగు ప్రజానీకానికి విస్తరింప బడుతున్నది. మన రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాలలో జరిగే ఎన్.ఐ.ఎఫ్. ద్వారా నిర్వహింపబడే సభలు, సమావేశాల వివరాలు, అట్టి సమావేశాల్లో ఇన్నోవేటర్లు పొందే పురస్కారాల సమాచారం, పాఠకుల ప్రతిస్పందన, పెద్దల ఆలోచనలు ఈ పత్రికలో ప్రచురింపబడుచున్నవి. దిన దినాభివృద్ధి చెందుతూ, ముచ్చటైన ముఖ చిత్రాలతో ఈ పత్రికని ఇంతవరకు ఐదు సంచికలు వెలువరించడం జరిగింది. ఈ పత్రిక ఇప్పటివరకు ప్రధానంగా ఉచితంగానే పంపిణీ చేయబడుతున్నది కనుక ఈ ప్రచురణకు ఆర్థిక అగచాట్లు సహజమే కదా. చందాదారుల సంఖ్య మెల్లగా పెరుగుతున్నది. అధిక సంఖ్యలో పాఠకులు చందాలు పంపిస్తే ఈ పత్రికను నడపడం సులువౌతుంది. అయితే కొన్ని స్వచ్ఛంద సంస్థలు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కొన్ని ప్రభుత్వ శాఖలు అప్పుడప్పుడు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నాయి. ఎన్.ఐ.ఎఫ్. మాతృ సంస్థ కూడా ఇక్కడ జరిగే కార్యక్రమాలను దృష్టిలో వుంచుకొని కొంత ఆర్థిక సహాయాన్ని అడపా దడపా అందజేస్తుంటుంది.

ఇన్నోవేటర్లను ప్రోత్సహించి, ఉత్తేజ పరచుటకు హనీబీ చేపట్టిన మరొక కార్యక్రమం



సభలు, సమావేశాలు నిర్వహించి ఈ సభల ముఖ్యోద్దేశ్యం తెలుగు ఇన్నోవేటర్లను ఆహ్వానించి, వారిని పెద్దలకు పరిచయం చేసి, వారి ఇన్నోవేషన్లను ప్రదర్శింపజేసి, వారికి ఇతోధిక ప్రోత్సాహం, అత్తేజం కలుగజేయడం. అట్లాంటి సభలు ఈ రెండు సంవత్సరాల్లో చాలా నిర్వహించినప్పటికి అందులో రెండు అతి ముఖ్యమైనవి. ఒకటి అక్టోబర్ 15, 2006న హైదరాబాద్‌లో నిర్వహించిన ఇన్నోవేటర్ల సమావేశం. మరియు రెండవది మే-జూన్ 2007లో ప్రకాశం జిల్లా కారంచేడులో నిర్వహించిన గ్రామీణ జాతీయ ప్రదర్శనలో పాల్గొనడం.

ఆంధ్ర మహిళాసభలో నిర్వహించిన సమావేశానికి 'హనీబీ కార్యక్రమాలకు మూల పురుషుడైన ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారు హాజరై మన రాష్ట్రానికి చ ఎందిన గ్రామీణ ఆవిష్కర్తలతో సమావేశం కావడం విశేషం. దీనితో వారిలో నూతనోత్సాహం కలిగిందనడంలో అతిశయోక్తి లేదు.

ప్రకాశం జిల్లా కారంచేడులో జరిగిన రైతు ప్రదర్శన దక్షిణ భారత స్థాయిలో ఏర్పాటు చేయబడింది. ఈ ప్రదర్శనను ఆం.ప్ర. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రారంభించడం జరిగింది. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ దారుల సంస్థలు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఇన్నోవేటర్లు, ఎన్ఐఎఫ్ సభ్యులు హాజరైనారు. ఈ ప్రదర్శనలో దక్షిణ భారతదేశంలోని ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శన విజయవంతంగా నిర్వహించబడింది.

జాతీయ స్థాయిలో 'హనీబీ' సంస్థ 'శోధయాత్ర'లు నిర్వహిస్తుంటుంది. ఈ యాత్రల ఉద్దేశ్యం ఎన్ఐఎఫ్ కార్యకర్తలు స్వయంగా గ్రామీణ సృజనలను కనుగొని వాటికి గుర్తింపు కలుగజేయడం మన రాష్ట్రంలో కూడా అట్టి శోధయాత్రలు నిర్వహించాలని 'హనీబీఏపి' యోచిస్తోంది.

గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలు, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించుటకు జాతీయ స్థాయిలో పోటీలు రెండు సంవత్సరాలు ఒకసారి జరుగుతుంటాయి. అట్టి పోటీలలో మన రాష్ట్రంలోని ఆవిష్కర్తలు పాల్గొనుటకు ఉత్సహపరిచే కార్యక్రమం కూడా 'హనీబీఏపి' నిర్వహిస్తున్నది.

ఈ విధంగా రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన 'హనీబీఏపి' ఒక స్థిరత్వాన్ని ఏర్పరచుకొని పల్లె ప్రజలలో తనదైన స్థానాన్ని నెలకొల్పుకుంటున్నది. 'పల్లెసృజన' పాఠకుల నుండి ఎప్పటికప్పుడు ప్రోత్సాహం లభిస్తున్నది. సలహాలు, సద్విమర్శలు చేరుతున్నవి. వారందరికి మా కృతజ్ఞతలు. పోటీలలో పాల్గొని విజేతలైన ఆవిష్కర్తలందరికి మా శుభాకాంక్షలు.

**తదుపరి కార్యక్రమాలు :**

రెండేళ్ళలో సాధించిన వాటితో తృప్తి చెంది అంతా సాధించామని అనుకుంటే 'హనీబీఏపి'కి సంపూర్ణ న్యాయం చేసినట్టు కాదు.

శైశవ దశలో వున్న ఈ సంస్థ పూర్తి స్థాయిలో ఎదగడానికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతో వుంది. ప్రస్తుతం గ్రామ స్థాయిలో కార్యకర్తలు లేరు. ఎన్ఐఎఫ్ గురించిగాని, హనీబీ గురించిగాని గ్రామ సీమల్లోని ప్రజల్లో అవగాహన లేదు కనుక ఈ సంస్థ కార్యక్రమాల్లో ఆసక్తికలవారు 'హనీబీఏపి'ని సంప్రదించాలని మా కోరిక. వారు హనీబీ చిరునామాకు వారి ఆసక్తిని తెలియజేస్తే ఈ సంస్థ వారిని సంప్రదించి సంస్థ కార్యక్రమాల పూర్తి వివరాలు తెలియజేసి వారిని సభ్యులుగా ఆహ్వానిస్తుంది. వీరిని గ్రామస్థాయి, మండల స్థాయి కార్యక్రమాల్లో పాలు పంచుకునే అవకాశం కలిగిస్తుంది.

హనీబీఏపి కార్యక్రమాలు 'పల్లెసృజన' ప్రజురణలు ప్రస్తుతం ఒకరిద్దరు కార్యకర్తలతోనే నడుస్తున్నది. మూలస్థాయి కార్యకర్తలుగాని, పల్లెసృజన పాఠకులుగాని ప్రస్తుతం ఇందులో పాలు పంచుకొనటం లేదు. ఈ రెండు కార్యక్రమాల్లో ఆసక్తికలవారు ఇందులో పాలు పంచుకుంటే చాలాకాలం మనగలుగుతుంది. కనుక ఈ కార్యక్రమాల్లో ఆసక్తికలవారు మాకు తెలియజేయాలని మా కోరిక.

పల్లెసృజన ప్రచురణకు ఆర్థిక వనరులు సమకూర్చుకొనుటలో ఏవైనా సలహాలుంటే మాకు తెలియజేస్తే సహాయకారిగా వుంటుంది. ఏ కార్యక్రమంలోనైనా విద్యార్థుల పాత్ర చాలా అవసరం. హనీబీఏపి కార్యక్రమాల్లో ఆసక్తిగల విద్యార్థులు విస్తృతంగా పాల్గొనాలన్నది ప్రస్తుత అవసరం.

శోధయాత్రల గురించి ఇదివరలో ప్రస్తావించడం జరిగింది. పూర్తిస్థాయి శోధయాత్ర ఏర్పాటుకు కొంత జాప్యం అయ్యే అవకాశం వుంది. కనుక 'మినీ శోధయాత్ర'లు నిర్వహించాలి. ఒకటి రెండు రోజులు గ్రామీణ ప్రాంతాలు పర్యటించి, గ్రామస్తులతో పరిచయాలు ఏర్పరచుకొని, స్వచ్ఛంద కార్యకర్తలను (వలంటీర్స్) వారికి సంస్థ కార్యక్రమాల్లో ఆసక్తి కలిగించాలి.

ఏదియేమైనా 'హనీబీఏపి', 'పల్లెసృజన' పూర్తి స్థాయిలో స్థిరపడి సమాజంలో ఒక స్థానం ఏర్పరచుకోవడానికి అందరూ సహకరించాలని కోరిక.

●



# Centre Spread

Centre Spread

సమీక్ష

# ప్రపంచీకరణ నేపథ్యంలో వెలుగుబాట

పల్లెసృజన

– డా. జె. కనకదుర్గ, సింగరేణి మహిళాకళాశాల, కొత్తగూడెం.

'పల్లెసృజన' పత్రిక మధువులూరించే మానస మేధాపుత్రిక. శాస్త్ర విజ్ఞానం పట్టణాలకే పరిమితమైందన్న భావనను పటాపంచెలు చేస్తూ మారుమూల పల్లెల్లోని ఆణిముత్యాలు కూడా చైతన్య దీపికలై ప్రపంచానికి జ్ఞాన జ్యోతుల కాంతులను ప్రసరింపజేయగలరనే దానికి మచ్చు తునకవంటి సంపుటాలను అందిస్తున్న 'పల్లెసృజన' ప్రశంసార్హమైనది. ప్రపంచీకరణ సందర్భంలో సామ్రాజ్యవాద శక్తులు, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని మానవ జీవితాలపై అణువణువునా ప్రభావాన్ని చూపుతూ ఆర్థిక సవాళ్ళతో పాటు చేస్తున్న సాంస్కృతిక దాడిని ఎదుర్కోవటానికి అంతర్గతంగా నిబిడీకృతమైన మేథోశక్తులతో అనుసంధానం ఎంతో అవసరం.


"మనకోసం మానవజాతికోసం మన విజ్ఞానం" అన్న నినాదంతో అన్ని రంగాలలోని పీడన శక్తులను చెరిపేట్టుగా బాధితులు తమ భావనా బలంతో మాథా శక్తికి పదును పెట్టి ఎదుర్కొనే అహింసా మార్గాన్ని చేపట్టడం నేటి యువత కర్తవ్యం. మేథకు పదును పెట్టడానికి కావాల్సింది ఆలోచనా శక్తి. తత్ఫలితంగా ఏర్పడే సృజనాత్మకత, ప్రపంచం చుట్టి రావటానికి మొదలయ్యే మొదటి అడుగు పల్లెల నుండి ప్రారంభమై సృజనాత్మకత కల్గిన సిరా చుక్కల అక్షరాలు లక్ష మెదళ్ళ కదలికలకు కరణమౌతాయి. అనిల్ గుప్తా గారి సారథ్యంలో, గణేశం గారి క్రియాశీలత, స్ఫూర్తివంతమై మానవ మేధాశక్తి విజయాలు సాధిస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

సృజనాత్మకత అనేది కళావైవిధ్యంతో కూడుకున్నది. 'కళ' అంటే 'నైపుణ్యం' ఏ పుట్టలో ఏ పాముందో' అన్నట్టుగా మారుమూల పల్లెల్లోని సంప్రదాయ విజ్ఞానానికి అక్షరాకృతిగా ఉన్న 'పల్లెసృజన' మానవ విజ్ఞాన రహదారిలో మైలురాయి వంటిది.

మన అవసరాలను గుర్తించటం, వాటికై ఆలోచనలు పదును పెట్టేట్టు చేయాలి. "ఎవరో వచ్చి ఏదో చేస్తారు" అనుకోవటం పొరపాటు. అగ్రరాజ్యాల తయారీలు అందటానికి వ్యయ ప్రయాసలు పడేకంటే, మన బుర్రలను ఉపయోగించి, మనమే చేసుకోవటం ప్రత్యామ్నాయంగా వుంటుంది. భారతదేశ జనాభాలో మూడవ వంతు ఉన్న నేటి యువత ముందుగా మేల్కొనాలి. మన యింటి విజ్ఞానం మానవాభివృద్ధికి తోడ్పడాలని సంకల్పించ గలగాలి. వ్యక్తిగత సృజనాత్మకతయే గాక, అన్వేషణాత్మక సృజనాత్మకత పరిపూర్ణతను కల్గిస్తుందని విద్యార్థులు "స్టూడెంట్స్ క్లబ్" ద్వారా సాధించటం వారి ప్రక్కన అండగా నిలబడిన యువశక్తులు "పల్లెసృజన"తో స్పష్టమవటం 'విజ్ఞాన' సహకార సంఘాల భవితకు బాటలు వేయటంగా భావించవచ్చు.

ప్రపంచీకరణ నేపథ్యంలో బీదవారు మరింత బీదవారుగా కావడం సామాజిక సత్యం. విద్యా, వైద్య రంగాలలో మానవ వనరులు వన మూలికలు వినియోగిత సామర్థ్యం దేశాభివృద్ధికి దిశా నిర్దేశం చేయగల దు. 'హనీబీఏపి' ఇన్నోవే టర్ల 'శోధయాత్ర'లో వెలుగులోకి తీసుకు వచ్చే కార్యక్రమానికి పరిశోధనా రంగంలో పెద్దపీట వేయాల్సిన విషయం.









అధిక జనాభా గల భారతదేశంలో ప్రజావళి జీవన ప్రమాణ స్థాయికి సంకేతం వ్యవసాయాభివృద్ధి. మొదటినుండి 4 సంచికల వరకు వెలువడిన 'పల్లెసృజన'లో 'మిరియాల' వంటి అధికోత్పత్తి మెలకువలు, రసాయనిక ఎరువులమీద తలమానికంగే వ్రేలాడే సేంద్రియ ఎరువుల తయారీ, పెస్టిసైడ్స్‌కి బదులు సీతాఫలం గింజల పొడి (విషముష్టిక వాయువు) వాడకం వంటివి అగ్రికల్చరల్ డిగ్రీ సర్టిఫికెట్ కంటే విలువైనది. 'పులిపిర్లకు' మామిడి జీడితో వైద్యం, వృద్ధుల నుండి అనాదిగా వస్తున్న సంప్రదాయ జ్ఞానం. వృద్ధులతో గడపటం, కొండల్లో, కోనల్లో గిరిజన మహిళల్తో గడిపితే మరింతగా ప్రకృతి విభాగాన్ని అగ్రతాంబూలమిచ్చే అవకాశం వుంటుంది అనే సూచన 'పల్లెసృజన' కీర్తి కిరీటంలో కలికితురాయిగా భాసిస్తాయి. ●

# చేనేతలో నూతన పద్ధతి



26 సం.ల శ్రీ షణ్ముగం, తమిళనాడు రాష్ట్రంలోని 'యస్‌యస్ యం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ'లో 3 సంవత్సరాల టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సు చదువుతున్నాడు. తరతరాలుగా వస్తున్న చేనేత వృత్తికారుల జీవన ప్రమాణాలు మెరుగు పరచాలన్న తపన అతనిలో కొత్త విషయాలు కనుగొనే ఆతురతను పెంపొందించింది. హైస్కూల్ దశలో అతను కనుగొన్న నూతన విషయాల ఉన్నత ప్రమాణాలను దృష్టిలో వుంచుకొని అతనికి టెక్స్‌టైల్ కళాశాలలో రెండవ సంవత్సరంలో ప్రవేశం లభించింది. ఈ విధంగా ప్రవేశం పొందిన అతి తక్కువమంది విద్యార్థుల్లో ఇతను ఒకడు.

అతను తన బాబాయి మరమగ్గాల కేంద్రంలో పని చేసేటప్పుడు మరమగ్గాలలో 'ఫిర్న్ వైండింగ్' మార్చుటలో వృధా అయ్యే సమయం, శ్రమ గమనించాడు. ఈ సమస్యను అధిగమించడానికి షటిల్ మగ్గానికి కొంత మార్పు చేశాడు. ఈ మార్పు వల్ల షటిల్ మగ్గానికి ఎప్పుడు ఫిర్న్ మార్చుతూ పోకుండా కండెలు ఆటోమాటిక్‌గా ప్రవేశ పెట్టబడతాయి. ఈ పద్ధతిలో రెండు వెస్ట్‌కోన్లు మగ్గానికి ఇరువైపుల ప్రత్యేకంగా మగ్గంలో దారాల పటుత్వం తగ్గకుండా చూస్తాయి. ఈ పద్ధతిలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి 15 నుండి 20 శాతం వృద్ధి సాధించవచ్చు. అంతేగాక తక్కువ శ్రమతో నాణ్యమైన వస్త్రాల ఉత్పత్తిలోనూ ఈ పద్ధతి సహాయపడుతుంది.



# క్రచ్‌తో నడక సులభం

చంకల క్రింద పెట్టుకునే కర్రల సహాయంతో నడిచే వాళ్ళకు ఒక వింత సమస్య ఎదురవుతుంది. అధిక వాడకం వల్ల కర్ర క్రింది భాగం అరుగుతూ చిన్నదవుతుంది. ఎత్తు సరిగ్గా లేకపోతే ఉపయోగించే వారికి ఇబ్బందికరం. ఇలాంటి సమస్యకు పరిష్కారం తిరునల్వేలి నివాసి శ్రీ చలం గారు ఈ పద్ధతిని సూచించారు.

కర్రతో చేసింది అయినా మెటల్‌తో చేసిందయినా క్రచ్ అధిక వాడకంతో అడుగు భాగం ఎక్కువగా ఒత్తిడి కల్గిస్తుంది. దీన్ని వాడినప్పుడు మనిషి బరువంతా దీనిపైనే పడుతుంది. ప్రి అడుగుకూ మనిషి భారమంతా ఈ క్రచ్ భరించాల్సి వస్తుంది. అడుగు భాగం అరగకుండా గట్టిగా చేస్తే ఒత్తిడి వల్ల వచ్చే ప్రకంపనాలన్నీ మనిషి భుజంపైకి ప్రసారం చేస్తాయి. దీంతో మనిషి భుజం నొప్పి, నడకలో కష్టం కల్గిస్తుంది. ఆనందాన్ని కోల్పోతాడు. ఇలాంటి ఇబ్బందులతో క్రచ్‌ను చాలాకాలం వాడితే అవయవాల్లో శాశ్వత పరిణామాలు వచ్చే అవకాశముంటుంది. అసలే కాళ్ళు సరిగ్గా లేక ఇబ్బందిలో వున్న మనిషికి మరో ఇబ్బంది ఈ అరిగే క్రచ్ దీని నివారణోపాయం?!

ఒక లోహంతో తయారైన (స్టెయిన్‌లెస్ స్టీల్) 4 సెంటీమీటర్ల ఎత్తుకు స్ప్రింగును క్రచ్ క్రింది భాగంలో బిగించాలి. ఈ స్ప్రింగ్ ఒక ప్లాస్టిక్ క్యాప్‌లో బిగించాలి. అయితే ప్లాస్టిక్ క్యాప్ సులభంగా క్రిందకి, మీదకి కదిలేలా బిగించాలి. (ఉదా. మోటార్ సైకిల్ షాక్ అబ్జార్బర్స్‌లాగా) ఈ ప్లాస్టిక్ క్యాప్‌ని అవసరం వచ్చినప్పుడు మార్చి కొత్తది బిగించుకునేలా అమర్చాలి.



పై విధంగా చేయడం వల్ల స్ప్రింగ్ ఒక షాక్ అబ్జార్బర్‌లాగా, కుషన్‌లాగా పని చేస్తుంది. దీనివల్ల భూమినుండి వచ్చే షాకులు, ప్రకంపనలు మనిషి భుజానికి చేరకుండా ఆగిపోతాయి. మనిషి సులభంగా నడవగలడు. స్ప్రింగ్ వల్ల క్రచ్‌లో అరిగే భాగం ఎక్కువ ఒత్తిడికి లోనవదు కూడా. ఈ మార్పు చాలా సులభం కాబట్టి ఎవరైనా బిగించుకోవచ్చు. క్రచ్ మార్చవలసిన అవసరం అంతగా ఉండదు.

మనిషి వేగంగా కూడా నడవగలడు, నడకలో ఆనందించగలడు.

**– డా. కె. చలం,** తిరునల్వేలి, చిత్తూరు జిల్లా.

పల్లెజ్ఞానం

# పల్లె తూకాల పరిజ్ఞానం

**- టి. భవాని శంకర రావు,** ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా.

విద్యావంతులకు తెలిసిన తూకపు కొలమానాలు గ్రాములు, కిలోగ్రాములు, క్వింటాళ్ళు, టన్నులు, పల్లెల్లో ఒక్కో ప్రాంతంలో ఒక్కో కొలమానం వాడుకలో వుంటుంది. రైతులు ఆయా ప్రాంతంలో ఆ కొలమానాలతో వృత్తులను, వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా కొలవడం తేలిక. ప్రజలే కాకుండా అక్కడ పనిచేసే అధికార్లు, వర్తకులు, సాహితీ అభిలాషికులు ప్రజల వ్యవహార జ్ఞానమును తెలుసుకోవడం అవసరం. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలో రైతాంగం, గ్రామీణ ప్రజలు ఉపయోగించే పదాలు, వాటి ప్రాముఖ్యతను గూర్చి తెలుసుకుందాం.

బండిగెత్తం : అధిక శాతం రైతులు సన్న, చిన్న రైతులు. వీరు తమ పంట పొలానికి ఎడ్లబండ్లమీద లేదా దున్నపోతుల బండ్లమీద పొనక వుంచి, దానిలో పశువుల గెత్తం నింపి పొలానికి వెళ్తూ వుంటారు. మనకు పుస్తకాలలో శాస్త్రీయంగా పంటలకు వేయవలసిన పశువుల గెత్తం టన్నుల రూపంలో చెప్పబడి ఉంది. నిజానికి రైతు ఈ టన్నులు అనే పదాన్ని వాడటం లేదు. ఒక బండి పశువుల గెత్తం అంటే 500 కిలోలకు సమానం. ఈ విషయ జ్ఞానం తెలుసుకోవడం అవసరం. రైతులతో మాట్లాడి నప్పుడు పశువుల గెత్తంను బండ్ల రూపంలో చెబితే వాళ్ళకి సులభంగా అర్ధమవుతుంది.

**బండి ధాన్యం :** ఒక బండి ధాన్యం అంటే ఆరు కట్టలు, అంటే 540 కిలోలు.

**కట్ట ధాన్యం :** కట్ట ధాన్యం అంటే 90 కిలోలు, 10 నేతులును ఒక కట్టగా చెబుతారు.

**పుట్టి ధాన్యం :** పుట్టి ధాన్యం అంటే 3 కట్టలు 270 కిలోగ్రాములను పుట్టి అంటారు.

సోల, తవ్వ, అద్ద (సేరు), కుంచము (తూము)

**సేతు :** రైతులు తమ ఉత్పత్తులైన ధాన్యం, బియ్యం, పెసర, మినుము, చోళ్ళు (రాగులు), కందులు, తౌడు వంటివి కొలవడానికి కర్రతోనూ, రేకుతోనూ తయారు చేసిన సోల, తవ్వ, అద్ద (సేరు), కుంచము (తూము), సౌతు వంటి కొలమానములను ఉపయోగిస్తున్నారు.

**సోల :** 250 గ్రాముల పరిమాణం.

**తవ్వ :** 500 గ్రా. పరిమాణం.

**అద్ద లేదా సేరు :** ఒక కిలోగ్రాము, నాలుగు సోలలు ఒక ఃఅద్ద, రెండు తవ్వలు ఒక అద్ద.

**తూము లేదా కుంచము :** 4 కిలో గ్రాములు, నాలుగు అద్దలు ఒక తూము.

**సేతు :** ధాన్యము అయితే 9 కిలోల పరిమాణం మిగిలిన (బియ్యం, పెసలు, మినుములు కందులు మొదలైనవి) అయితే 12 కిలోల పరిమాణం.

**పణం :** 80 వున్న పండ్లను (లేదా) కాయలను పణం అంటారు. కొబ్బరికాయలు, మామిడి కాయలు, మామిడి పండ్లు, మునగ కాడలు, దొండ కాయలు, బెండకాయలు పణాల లెక్కన రైతులు వర్తకులకు లేదా వినియోగదారులకు అమ్ముతారు. 12.5 పణాలు అంటే 1000 కాయలు. 75 పణాలు అంటే 6000 కాయలు. మంచి పరిమాణం గల కొబ్బరికాయలు 75 పణాలు అంటే ఒక లారీ లోడుకు సమానం.

**పుఃజ :** పండ్లు లేదా కాయలు నాలుగు.

**1 కట్ట కిల్లీ ఆకులు :** 100 ఆకులు వుంటాయి. ప్రస్తుతం ఈ పద్ధతిలోనే అమ్ముతున్నారు.

**మూర :** 30 సెంటీమీటర్లు. ఇల్లు, స్థలాలు కొలిచేటప్పుడు ఈ ప్రమాణాలను వాడుచున్నారు.

**1 కుంట :** 25 సెంట్లు; పొలం కొనేటప్పుడు లేదా దిగుబడులు చెప్పేటప్పుడు ఈ ప్రమాణాలతో చెబుతున్నారు.

పట్టణవాసులు కూడా ఈ గ్రామీణ ప్రమానాలను తెలుసుకుంటే గ్రామీణులతో మాట్లాడేటప్పుడు వారికి అర్థమయ్యే ప్రమాణాల ను ఉపయోగించి మాట్లాడితే వారికి విషయం బాగా అర్థమౌతుంది. వారు కూడా ఎంతో సంతోషించడమే కాదు. పట్టణవాసులు కూడా గ్రామీణ పరిజ్ఞానం పెంచుకున్నట్లు అవుతుంది. ●



# సామాన్య రైతుల్లో అసామాన్య ఆలోచనా సరళి

– పి.వి. సూర్యప్రకాశరావు, టెక్నికల్ అడ్వయిజర్ & డైరెక్టర్, ప్రియ ఫుడ్స్ (పై) లిమిటెడ్.

**బెల్లం నిల్వలో చిన్న చిట్కాలు పెద్ద ప్రయోజనాలు**





వర్షాకాలం గాలిలో తేమ ఎక్కువగా వుంటుంది. ఈ కాలం బెల్లం తేమను పీల్చుకొని మెత్తబడటం, కొన్ని సమయాల్లో నీరుగారి పోవటం జరుగుతూ వుంటుంది. దీనివల్ల బెల్లం తయారీదార్లకు విపరీతమైన నష్టాలు సంభవిస్తాయి. అయితే తూర్పు గోదావరి జిల్లాలోని తాపేశ్వరి – రామచంద్రాపురం ప్రాంతాల్లోని రైతులు తెలివిగా ఈ నష్టాల నివారణకు ఒక చిన్న ఉపాయాన్ని కనిపెట్టారు. వర్షాకాలంలోను, గాలిలో తేమ మరీ ఎక్కువయినప్పుడు, నిల్వ చేసిన బెల్లం చుట్టూ వున్న అధిక తేమ వాతావరణాన్ని సునాయాసంగా మార్చి ఎండాకాలం వాతావరణాన్ని లేక పొడి వాతావరణాన్ని కలుగజేయటమే వారు కనుగొన్న సింపుల్ సృజనశీల పద్ధతి.

ఇందుకు బెల్లం నిల్వ వుంచే స్థలంలో అటకలపైన చెఱకు ఆకుల్తో చుట్టి తాటాకు బుట్టల్లో పెట్టిన బెల్లం అచ్చులను పేర్చి, వాటిక్రింద నేలమీద వరి ఊకను మందంగా పరిచి, వర్షాకాలంలో తలుపులు, కిటికీలు మూసి ఊకకు నిప్పంటిస్తారు. నిప్పు పెడితే ఊక మండదు. పొగ మాత్రం వస్తుంది. వాతావరం వేడెక్కుతుంది. గాలిలో తేమ శాతం గణనీయంగా తగ్గుతుంది. బైట వర్షాకాలం అయితే బెల్లం నిల్వ గదుల్లోపల ఎండాకాలం వాతావరణం నెలకొంటుంది. వర్షాలు ఆగి మామూలు వాతావరణం ఏర్పడగానే, రెండు, మూడు రోజులు ఆగి, నిల్వ గదుల తలుపులు, కిటికీలు తెరుస్తారు. గాలి పారనిస్తారు. ఈ చిన్న ప్రక్రియవల్ల బెల్లం అచ్చులు వానాకాలంలో దెబ్బతినకుండా, వాటి నాణ్యత ఏమాత్రం కోల్పోకుండా భద్రంగా వుంటాయి.



శాస్త్రరీత్యా తెలుసుకొన్న విషయం ఏమిటంటే గాలిలో తేమ శాతం 55కి మించినట్లయితే బెల్లం తేమను అధికంగా పీల్చుకొని దెబ్బతింటుంది. 55కి తక్కువ వుంటే తినదు. పైన తెల్పిన విధంగా చేసినప్పుడు అంటే ఊకను కాల్చి చుట్టూ వున్న ప్రదశంలో వేడిని పెంచినప్పుడు వర్షాకాలం / అధిక తేమ వాతావరణం మారి ఎండాకాలం / పొడి వాతావరణం ఏర్పడుతుంది. అందువల్ల బెల్లం చెక్కు చెదరకుండా వుంటుంది. ఈ మెలకువలను వంటబట్టించుకున్న రైతులు ఈ ప్రక్రియను ఇంకా మెరుగైన పద్ధతుల్లో అమలు పరిచి ఎక్కువగా



ప్రయోజనాన్ని పొందగలుగుతున్నారు.

**విశాఖ జిల్లా చూచుకొ,డ గ్రామ రైతులు అవలంభించే మరో తెలివైన పద్ధతి**

ఇది పైన సూచించిన విధానంకంటే ఇ,కా సులువైన పద్ధతి. ఇందులో బెల్లం నిల్వ చేసే రైతులు, గ్రామీణులు తమతమ తటాకు పూరిండ్లలో వున్న పొయ్యిలపైన అటకలు అమర్చి, బెల్లం అచ్చులను తాటాకులతో చుట్టి అటకలపైన ఏటవాలుగా నిలబెట్టి పేరుస్తారు. అటకలపైన పూరి కప్పు క్రింద కిటికీలు లాంటివేవీ వుండవు. ఇలా చేయటం వల్ల పొయ్యిల వద్ద వున్న వాతావరణం వంట-వార్పు వల్ల పగలంతా వేడిగానూ, బాగా చెమ్మగానూ వుంటుంది. రాత్రిపూట వాతావరణం చల్లబడటం వల్ల అటకలపైన చెమ్మ ఇంకా పెరుగుతుంది. పైన వుంచిన బెల్లాన్ని ఈ వేడి, చెమ్మ ఆవరించి, బెల్లానికి 'ఉక్కపోత' వాతావరణాన్ని కలుగజేస్తుంది. ఇలా ప్రతిరోజూ కొన్ని వారాల పాటు జరుగుతూ వున్న ఫలితంగా బెల్లంలో చక్కెర మినహా మిగతా జిగురు వగైరా పదార్థాలన్నీ బెల్లం నుండి వేరుపడి ద్రవ రూపంలో క్రిందకు జారి అటక క్రింద తలక్రిందులుగా వేలాడదీసిన తాటాకు గొడుగుల్లోకి, దాని క్రింద అమర్చిన తాటాకు బుట్టల్లోకి చేరుతుంది. ఈ చర్య ఎండాకాలమంతా ఎడతెరిపి లేకుండా జరగటం వల్ల బెల్లంలోని అసలు సిసలైన చక్కెర పదార్థం తదితర ద్రవ్యాల నుండి విడివడి ఒక విధంగా శుద్ధీకరణ జరిగి బాగా గట్టిపడుతుంది. బెల్లం అచ్చులు అసాధారణ రీతిలో దృఢత్వం చెంది బెల్లం 'రవ్వకట్టు' రాటుదేలుతుంది. పర్యవసానంగా బెల్లం నాణ్యత అన్ని విధాలా మెరుగుపడుతుంది. రంగు నిర్మలంగా స్వచ్ఛందంగా రూపాంతరం చెంది, అచ్చులు రాతి బండల మాదిరి తేలి, నాణ్యత గణనీయంగా పెరుగుతుంది. వేసవి తరువాత వచ్చే వర్షాకాలమంతా బెల్లం చెక్కు చెదరకుండా నిల్వ వుంటుంది. మామూలు గ్రామీణ ప్రజలు తమ సృజన శక్తి ద్వారా కనిపెట్టిన ఈ బెల్లం నిల్వ పద్ధతి. సూక్ష్మంలో మోక్షం అనే సామెతకి ప్రబల తార్కాణంగా నిలుస్తుంది.

ఈ పై రెండు విధానాల వివరాలు పొందగోరు వారు అనకాపల్లి (విశాఖ జిల్లా) లోని చెఱకు పరిశోధనా స్థానంలోని బెల్లం విభాగానికి వ్రాయగలరు.

ఇంకా ఇతర రైతులెవరైనా మరో పద్ధతి ఏదైనా పాటించి లాభ పడినట్లయితే, బెల్లం తయారు చేసే రైతులకు, నిల్వ చేసే గ్రామీణులకు, తదితరులకు బహుల ప్రచారం ద్వారా ఈ పద్ధతుల వివరాలు తెలియజేస్తే వారు విశేష లబ్ధిని పొందగలరు. ●



ప్రయోగం

# తుఫాన్లకు ఎదురొడ్డి నిలిచిన నీలగిరి ముద్దు గోపాలకృష్ణ వినూత్న ప్రయోగం

గత దశాబ్ద కాలంగా ఐ.టి.సి. భద్రాచలం పేపర్ మిల్స్ జనరల్ మేనేజర్ (ప్లాంటేషన్) గా పనిచేస్తున్న డా. హెచ్.డి. కులకర్ణి గారు తన అపార అనుభవంతో రైతులకు తనవంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఈ సదుద్దేశ్యంతో "భద్రాచలం క్లోన్" అనే యూకలిప్టస్ వెరైటీ మొక్కను తమ పరిజ్ఞానంతో తయారు చేశారు. ఈ రకం మొక్క అతి స్వల్ప సమయంలో అధికంగా పెరిగి ఎక్కువ కలపను ఇస్తుంది. ఈ కలపను పేపర్‌మిల్లు ఉపయోగించే 'పల్ప్' కొరకు విక్రయించి రైతు అత్యంత లాభాలను ఆర్జించవచ్చని ఆయన తెలియజేస్తున్నారు.

అంతేకాదు ఈ మొక్కల పెంపకం కూడా చాలా సులభం. ఈ రకం యూకలిప్టస్ చెట్లను రైతులు గోదావరి పరిసర ప్రాంతాలలో విరివిగా నాటి మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. యూకలిప్టస్ మొక్కను కనుగొని రైతులపై వదలటంతోనే తనపని అయిపోలేదన్న సత్యాన్ని గ్రహించిన శ్రీ కులకర్ణి గారు అనునిత్యం రైతులతో మమేకమై వారితో చర్చించి ఈ యూకలిప్టస్ సాగును చేస్తున్న రైతులకు తగిన మార్గదర్శకత్వం చేయడం ముదావహం.

'పల్లెసృజన' ఈమధ్య కులకర్ణి గారిని కలిసిన సందర్భంగా తన సారథ్యంలో అత్యంత ఎక్కువ దిగుబడిని సాధించిన ఇద్దరు రైతులను గురించి పల్లె సృజనకు తెలియజేశారు. ఈ వినూత్న ప్రయోగాన్ని, కులకర్ణి గారి భావాలను 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సదుద్దేశ్యంతో ఆయా రైతుల అనుభవాలను, సాగుకు తాము అవలంభించిన విధానాలను ప్రచురిస్తున్నాం. ఈ అనుభవాలను చదివిన పాఠకులు మీ అనుభూతుల్ని మాకు తెలియజేస్తే ఈ శీర్షిక విజయవంతం అయినట్లుగా భావిస్తాం. – ఎడిటర్, పల్లెసృజన

పశ్చిమ గోదావరి జిల్లా నిమ్మలగూడెం గ్రామానికి చెందిన అరవై సంవత్సరాల వ్యవసాయ దారుడు ముద్దు గోపాలకృష్ణ. సంప్రదాయంగా పొగాకు రైతు కాని, యూకలిప్టస్ క్లోన్‌ను 40 ఎకరాల్లో నాటడం జరిగింది. ఈ ప్రాంతం తుఫానులకు నిలయమని యావత్ రాష్ట్ర రైతాంగానికి తెలిసిందే. అలాంటి ఒక తుఫాను వల్ల అతి వేగంగా పెరిగే క్లోను మొక్కలు ఒకవైపు పూర్తిగా వంగిపోయి, వాటి పెరుగుదల కూడా ఆగిపోయింది. అంతే కాకుండా వంగిపోవడంతో 'ఎపికోర్నిక్ షూట్స్" రావడం ప్రారంభమయ్యాయి. గోపాలకృష్ణ వెంటనే వృక్షశాస్త్రవేత్తలను సంప్రదించారు. 12 మీటర్ల ఎత్తు 25 సెంమీ. లావు, రెండేళ్ళ మొక్కలు, దాదాపు వెయ్యి టన్నుల కట్టె గల వంగిన చెట్లకు ఏ పరిష్కారం తోచలేదు. అన్ని చెట్లను కొట్టేసి కొత్త మొక్కలను నాటమని మాత్రమే చెప్పగలిగారు శాస్త్రవేత్తలు.

గోపాలకృష్ణ గారికి శాస్త్రవేత్తల సలహా రుచించలేదు. తన అనుభవంతో సృజనాత్మక శక్తిని ఉపయోగించి, ఒక వినూత్న ప్రయోగాన్ని విజయవంతంగా చేశారు.

చెట్లు వంగడానికి కారణం తలభాగం బరువుగా ఉండటం వల్ల అని ఎంతో ఆలోచించి నిర్ణయించుకున్నారు. అందువల్ల వచ్చే తుఫాను కారణంగా ఒకవైపుకు వంగిపోయిందన్న నిశ్చయానికి వచ్చారు. కొమ్మలన్నీ కొట్టేసి కాండంపై వున్న ఆకులను మాత్రం అలాగే ఉంచారు. ఆ తర్వాత వంగిన వైపు త్రవ్వి చెట్టును నిట్ట నిలువుగా నిలబడేలా చేశారు. ఒక నెల తర్వాత చెట్టు తిరగి మామూలుగా కొమ్మలు పెట్టడం ప్రారంభమైంది. కాండం పెరగడం తిరిగి ప్రారంభమైంది. చివరికి నాల్గవ సంవత్సరంలో చెట్లనుండి దాదాపు రెండువేల టన్నుల కట్టెను అమ్మగలిగారు.

ఈ వినూత్న పద్ధతిలో గోపాలకృష్ణ గారు చెట్టు పెరుగుదలలో కాని, విలువలో కాని ఏమాత్రం నష్టపోలేదు. తుఫాను ప్రాంతమంతా ఇప్పుడు గోపాల కృష్ణ గారి పద్ధతినే అనుసరిస్తున్నారు. శాస్త్రవేత్తలు కూడా ఈ పద్ధతిని రైతులకు సూచిస్తుండటం విశేషం.

గోపాలకృష్ణ అంతులేని విశ్వాసం, సృజనాత్మక శక్తి, అపార దీక్ష కోస్తా ప్రాంతంలోని యూకలిప్టస్ రైతులకు ఒక వినూత్న పద్ధతిని అందించి ఆ ప్రాంతంలోని వ్యవసాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడం అభినందనీయం.

●



# ముత్తంగి బుచ్చిరామయ్య చిరు ఆలోచనతో భద్రాచలం నీలగిరిమయం



సేకరణ : **యన్.వి.ఎస్. మూర్తి,** సింగరేణి కాలనీ, కొత్తగూడెం.

ఖమ్మం జిల్లా భద్రాచలం మండలం నందిగామ నివాసియైన 50 యేళ్ళ ముత్తంగి బుచ్చిరామయ్య గోదావరీ తీర ప్రాంతంలో వ్యవసాయం చేస్తాడు. నదీతీర ప్రాంతంలో 'సుబాబుల్' చెట్లు నాటేవాడు. ఈ ప్రాంతం ముఖ్యంగా వర్షాకాలంలో పూర్తిగా మునిగిపోతూ వుండటం వల్ల నాటిన సుబాబుల్ చెట్టు అన్నీ మిగిలేవి కావు. ఇలా ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వచ్చే వరదల వల్ల సుబాబుల్ చెట్లన్నీ కొట్టుకుపోయాయి. ఆ ప్రాంతంలోని రైతులందరూ నష్టాలు భరిస్తూ వస్తున్నారు.

బుచ్చిరామయ్య ఈ నష్టాలను భరిస్తూ పద్ధతి మారిస్తే బావుంటుందని భావించాడు. ఐ.టి.సి. వారు వ్యాప్తి చేసిన యూకలిప్టస్ కొమ్మలను నాటడానికి నిశ్చయించుకున్నాడు. 1992 జూన్‌లో వంద మొక్కలు నాటాడు. కాని దురదృష్టవశాత్తు జులై నెలలో వరదలు వచ్చి ఆ మొక్కలన్నీ చచ్చిపోయాయి. బుచ్చిరామయ్య పట్టువదలని విక్రమార్కుడిలా ఐటిసి భద్రాచలం వారి వద్దకి వెళ్ళి వారు వద్దన్నా వినకుండా వారిని ఒప్పించి మళ్ళీ అక్టోబర్ 1992లో 200 మొక్కలు నాటాడు. 1993లో వరదలు రానందున ఈ మొక్కలన్నీ బ్రతికాయి. అక్టోబర్ 1993లో మరో 1000 మొక్కలు నాటాడు. కాని ప్రకృతి విలయతాండవంతో మళ్ళీ ఆగస్టు 1994 వరదల్లో సగం పైగా మొక్కలు నాశనమైనాయి. బుచ్చిరామయ్య 1994 అక్టోబర్‌లో మరోమారు 100 మొక్కలు నాటాడు. అంతే కాకుండా అంతర్ పంటగా మిరప చెట్ల మధ్య వేశాడు. మిరపకు వేసిన ఎరువులతో అక్టోబర్ 94 నుండి ఆగస్టు 95 వరకు అంటే 10 మాసాల్లో మొక్కలు 7-8 మీటర్ల ఎత్తు పెరిగాయి. ఈ అద్భుత పెరుగదలతో 94లో వచ్చిన వరదలు ఈ చెట్ల ఏమీ చేయలేక పోయాయి. అంతే కాకుండా 1993లో మొక్కలు నాటడానికి అయిన ఖర్చు మిరప పంట ఆదాయంతో సరిపోయింది.

బుచ్చిరామయ్యది అద్భుత ప్రయోగం. భద్రాచలం ప్రాంతంలోని రైతులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. గత 15 సంవత్సరాలుగా ఈ ప్రయోగాన్ని వందలాది మంది రైలు వాడి సత్ఫలితాలను పొందారు. భద్రాచలం - గోదావరి ప్రాంతం ఇప్పుడు ఎంత పచ్చగా ఉందో చూసి ఆనందించాల్సిందే.

బుచ్చి రామయ్య వరద తీరుసు సరిగ్గా గమనించి వానాకాలం తర్వాత మొక్కలు నాటాడు. ఇది ఒక విప్లవాత్మక పద్ధతి అంతేగాకుండా ఈ మొక్కలు వేగంగా పెరగడానికి అతి తెలివిగా అంతర పంటలను వాడాడు. ఈ వినూత్న ప్రయోగం ద్వారా సాధించిన విజయంతో తోటి రైతులు ప్రేరేపితులై భద్రాచలం ప్రాంతాన్ని పచ్చటి చెట్ల తోటలతో నింపేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి మూలకారకుడైన శ్రీ బుచ్చిరామయ్య గారికి పల్లెసృజన అభినందనలు తెలియజేస్తోంది. ●





సౌలభ్యం

# కొబ్బరి వ్యవసాయంలో ఉపయోగించే పనిముట్లు వాటి వివరాలు

## కొబ్బరి కోత యంత్రం



- 50 అడుగుల పొడవున్న కొబ్బరి చెట్లనుంచి కూడా పక్వానికి వచ్చిన కొబ్బరికాయలను కోయటానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందీ కోత యంత్రం.
- ఈ యంత్రాన్ని ఉపయోగించటానికి ఇద్దరు వ్యక్తులు చాలు. ఒకరు వాహనం నడుపుతూ వుంటే మరొకరు కాయలు కోస్తారు.
- 10 లివర్లున్న హైడ్రాలిక్ జాక్‌ను ట్రాక్టర్‌కు బిగాస్తారు. ఈ హైడ్రాలిక్ జాక్‌ని అవసరాన్ని బట్టి మార్చుకునే వీలు కూడా వుంటుంది. దీనివల్ల ఒక వ్యక్తిని చెట్ల చివరి అంచు వరకు తీసుకువెళ్ళే అవకాశముంది. దానికోసం తేలికైన ఇనుప రేకులను వాడారు.



## కొబ్బరి చెట్టు నిచ్చెన

- కొబ్బరి తోటలోని చెట్లను అతి సునాయాసంగా ఇంటి మెట్లు ఎక్కినంత సులువుగా ఎక్కవచ్చు.
- కొబ్బరికాయలను కోయటానికి, క్రిమి సంహారక మందులు చల్లటానికి చెట్టుపైకి ఎక్కడం ఇక ఎంతో సులభం.
- ఈ సాధనం ఉపయోగించడం ద్వారా స్త్రీలు కూడా కొబ్బరి చెట్లను అతి సులభంగా ఎక్కగలరు.
- వర్షాకాలంలో కూడా కొబ్బరిచెట్టు ఎక్కడానికి ఎలాంటి భయం అవసరం లేదు.

## కొబ్బరి పీచు తీసే యంత్రం



- కేవలం ఒకటిన్నర హార్స్‌పవర్ మోటారుతో బెల్టు ద్వారా సిలిండర్ ఆకారంలో వున్న మెటర్ రాడ్‌ను కలుపుతారు. రాడథ ంవరి భాగానికి రెండు పదునైన బ్లేడ్లను ఒకవైపు అమరుస్తారు.
- రెండు బ్లేడ్లు ముప్పావు అడుగు పొడుగుంటాయి. వాటి మధ్య ఒక అంగుళం దూరం వుంటుంది. ఒకదాని తర్వాత మరొకటి చొప్పున ఈ బ్లేడ్లు మనకు కావాల్సిన మేరకు కొబ్బరి పీచును తీసివేస్తాయి.
- సగటున గంటకు 150 కొబ్బరి కాయల పీచును తీయవచ్చు. అంటే 8 గంటల పని సమయంలో 7,200 కొబ్బరి కాయల పీచు తీయవచ్చన్నమాట.

## కొబ్బరి కాయలను పగులగొట్టే యంత్రం



✻ ఎక్కువగా కొబ్బరి కాయలను పగులగొట్టే అవసరమున్నవారు ఈ యంత్రాన్ని వాడటం వల్ల పని సులభంగా జరుగుతుంది.

✻ ఈ యంత్రం వాడటం వల్ల కొబ్బరికాయను కత్రించడమే కాని, కత్తి వేటుతో నరకడం కాదు.

### కొబ్బరి కాయలను పగులగొట్టే మరో యంత్రం

- ఇనుప కత్తితో తయారు చేయబడిన ఈ యంత్రం కొబ్బరి కాయను రెండు ముక్కలుగా చేస్తుంది.
- ముక్కలైన కొబ్బరి కాయనుండి కొబ్బరిని తీసి నూనె తయారు చేయడానికి గాని, పంటకు గాని ఉపయోగించుకోవచ్చు.



## నీళ్ళ కొబ్బరి పంచ్ కట్టర్

❀ లేత కొబ్బరి కాయను పై భాగాన కొద్ది కొద్దిగా కత్తిరిస్తుంది.

❀ ఆ తర్వాత స్ట్రా వేసుకుని కొబ్బరి నీళ్ళు త్రాగవచ్చు.

❀ కొబ్బరినీళ్ళు త్రాగిన తర్వాత మళ్ళీ కొబ్బరి కాయను రెండు ముక్కలుగా చీల్చి అందులోని లేత కొబ్బరిని కూడా తినవచ్చు.

## కొబ్బరి విత్తనాల సేకరణ



15 నుండి 20 సంవత్సరాల వయసున్న తల్లి వృక్షం నుంచి విత్తటానికి అనువైన వాటిని సేకరించాలి. ప్రతి కొబ్బరికాయల గెలలో కనీసం 24 కాయలున్న గెల వున్న చెట్టును మాత్రమే ఎంచుకోవటం మంచిది. పక్వానికి వచ్చిన కాయలు క్రింద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వాటిని విడిగా సేకరించి విత్తుకోవాలి.



## కొబ్బరి పీచుతో నారను తీసే యంత్రం

పచ్చి కొబ్బరి బోండాంకు తీసిన పీచుతో టెంకాయ తాడు తయారు చేయడం చూసే వుంటారు. ఆ తాడు తయారు చేయడానికి కావలసిన నారను తీయడం ఇప్పుడు ఇంకా సులువు. ఈ యంత్రానికి బాగా ఆరిన కొబ్బరి పీచును అందిస్తే అది అత్యంత నాణ్యమైన నారను ఓవైపు, మిగతా పొట్టును మరోవైపు వేరు చేసి ఇస్తుంది. పొట్టును పొలాలకు ఎరువుగా వేయడమే కాదు, ఇంకా ఎన్నో ఉపయోగాలున్నాయి.

ఉద్యమం

# పుట్టించలేని నీటిని కాపాడుకుందాం

- ఉప్పుతేళ్ళ కృష్ణ, ప్రకాశం జిల్లా.

మాది గుంటూరు - ప్రకాశం జిల్లాల సరిహద్దు గ్రామం. ఉన్నది కోస్తా ప్రాంతమైనా మావి మెట్టభూములే. 100 శాతం వ్యవసాయ ఆధారిత పంటలే పండిస్తాము.

మా ఊరికి ఉత్తర సరిహద్దున 'ఓగేరువాగు', దక్షిణ సరిహద్దున 'ఎనమదల వాగు' ప్రశిస్తుంటాయి. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. వర్షాలు ఆగిపోయినా మరికొద్ది కాలం ఉంటే నవంబరు - డిశంబరు దాకా కొద్ది కొద్దిగా ప్రవహిస్తూ వుంటాయి. మే నెలకు పూర్తి ప్రవాహం ఆగిపోతుంది.

నీరు అవసరం అయ్యే నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ప్రక్క భూముల పంటలు నీరు లేక వాడిపోయి ఎండిపోవటం జరుగుతూ వుండటం వల్ల దిగుబడి తగ్గటం మామూలే. జూన్ నుండి సెప్టెంబర్ దాకా ఎగువన కురిసిన వర్షాలకు వాగులు ప్రవహిస్తుంటే 'లిఫ్ట్ ఇరిగేషన్' (ఎత్తిపోతల పతకం) ద్వారా పంటలు పండించుకుంటాము. అదీ కొద్దిమంది మాత్రమే. ఇది ఇలా ఏ కొందరికో కాక గ్రామంలోని రైతులందరికీ ఉపయోగకరంగా ఉండేలా ఏదైనా ఆలోచిస్తే బాగుంటుంది.


ఇలా వర్షాకాలంలో వృధాగా పారిపోయి సముద్రం పాలవుతున్న నీటిని సాగునీటికి, త్రాగునీటికి ఉపయోగిస్తే బాగుంటుంది. ఎన్నెన్నో ప్రాజెక్టులు రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్నాయి. నీటి వనరుల నదులు రాష్ట్రాల గుండా ప్రవహిస్తుంటే వివాదాలు రూపుదాల్చి ఆ ప్రాజెక్టులు పూర్తి కాకుండా సమయం, శ్రమ, డబ్బు వృధాగా ఉండిపోవటం చాలా బాధగా అనిపిస్తుంది.

దీనికి పరిష్కారం అన్నట్లుగా ఒక ఆలోచన 'చిన్న నీటి మొత్తాల పొదుపే శతకోటి జీవుల ఆశల మదుపు'.

**చెక్ డ్యామ్ :** కొండలు, ఎగువ ఎత్తు భూముల ప్రాంతాల్లో కురిసిన వాన నీటి ప్రవాహములను 'ఒడచి' పట్టుకొనుటే దీని భావన. ఇది తెలిసిన పరిజ్ఞానమే. దిగు భూముల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుంది. ప్రక్క ప్రాంతాలకు కొద్ది మొత్తంలో త్రాగునీరు లభిస్తుంది.

**వాటర్ ప్యాకెట్ :** కొండలు, ఎత్తు భూముల నుండి జారిన నీటి 'జాలు'లను కొంతవరకు 'చెక్ డ్యాము'గా రూపొందించాక కూడా మిగిలిన జలం క్రిందకు 'వాగు'గా మారి ప్రవహిస్తూ వృధా అవుతూ వుంటుంది. ఇక్కడ వాగు వెడల్పు 10 మీటర్ల నుండి 25 మీటర్ల వరకు, లోతు ఒకటిన్నర మీటర్లు వుండవచ్చు. ఇక్కడే గనక మనం వాగు కరకట్టలు 'బలవంతము' చేసి వాగు ప్రవాహమును ఆపి, రెగ్యులేట్ చేయు తలుపులు అమర్చినట్లయితే ఇక్కడ ఇదో చిన్న బ్యారేజిగా రూపొంది, తలుపులకు ఎగువన నీరు నిలిచి, సంవత్సరం పొడవునా సాగుకు త్రాగు అవసరాలకు ఈ నీరు ఉపయోగపడుతుంది. దీనికి అయ్యే ఖర్చు కూడా బహు తక్కువ. ఉపయోగం బహు ఎక్కువ. వర్షాకాలంలో ప్రవాహ వేగాన్ని బట్టి తలుపులను ఎత్తుతూ నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించవచ్చు.





**వాటర్ జాకెట్ :** ఈ పదం వాడుటకు వింతగా వున్నా సందర్భమునకు అనుగుణమైన పదమే. పైనుంచి చెక్ డ్యామ్ నుండి మించిన నీరు దొర్లి వాటర్ ప్యాకెట్ రూపంలో నిలువ వుంటుంది. (చిన్న బ్యారేజ్) ఒక్కోమారు వాటర్ ప్యాకెట్ కెపాసిటీని మించి కూడా నీరు ప్రవహించవచ్చు. వర్షాలు బాగా కురిసినప్పుడు వాటర్ ప్యాకెట్లకు అనుసంధానంగా 'వాటర్ జాకెట్'లో నీరు నిలువ వుంచుతాం. వాటర్ జాకెట్ అంటే మరేదో కాదు. వాటర్ ప్యాకెట్ నుండి ప్రక్కకు పొడిగింపబడిన కాలువ చివరి పెద్ద చెఱువు.

ఈ నిర్మాణము వలన అధిక మొత్తంలో నీరు నిలువ వుంటుంది. దీని వైశాల్యం కొన్ని వందల హెక్టార్లు కూడా కావచ్చు. ఒక సీజన్‌లో నిండిన వాటర్ జాకెట్ వలన మరో సంవత్సరం మరో సీజన్నో కూడా నీటిని వినియోగం చేయవచ్చు. ఒక వాగు నీటి ప్రవాహంపై అనేకానేక వాటరన్ ప్యాకెట్లు, జాకెట్లు నిర్మించవచ్చు. వృధాగా పారిపోయే నీటికి మనదేశం, రాష్ట్రం చిన్న చిన్న నదులకు వాగులకు పెట్టింది పేరు.


కొంచెం మన దృక్పథాన్ని మార్చుకుంటే ఎంతో ఉపయోగంగా వుంటుంది. కృష్ణానది చెంతనే గల గుంటూరు పట్టణం ఎండాకాలం వస్తే దాహార్తితో తహతహలాడుతుంది. ఒక్క గుంటూరు నగరమే కాదు, ఇంకా ఎన్నో నగరాలు, పట్టణాలు ఉన్నాయి మన రాష్ట్రంలో.

ఒక్క విషయం మనం గుర్తుంచుకోవాలి. 'నీటిని పుట్టించలేము, కట్టించలేము. వృధా కాకుండా కాపాడుకోవాలి, జీవామృతాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలి'.

●



# పేటెంట్ పొందిన తెలుగు ఇన్నోవేటర్ పరమహంస



S. No : 044 000096

INTELLECTUAL PROPERTY INDIA

भारत सरकार
GOVERNMENT OF INDIA
पेटेंट कार्यालय
THE PATENT OFFICE
पेटेंट प्रमाणपत्र
Patent Certificate
(Rule 74 of Patents Rules)

| | | |
|---|---|---|
| Patent No. | : | 204415 |
| Application No. | : | 394/CHE/2004 |
| Date of Filing | : | 29/04/2004 |
| Patentee | : | TATOLU SIVANANDA PARAMAHAMSA. |

It is hereby certified that a patent has been granted to the patentee for an invention entitled MULTIPURPOSE USEFUL LPG ENGINE as disclosed in the above mentioned application for the term of 20 years from the 29 day of APRIL 2004, in accordance with the provisions of the Patents Act, 1970.

Date of Grant: 21/02/2007

Controller of Patents

Note.-The fees for renewal of this patent, if it is to be maintained, will fall / has fallen due on 29 day of APRIL 2006 and on the same day in every year thereafter.

'పల్లెసృజన' పాఠకులకు గ్యాస్‌తో నడిచే పంపుసెట్‌ను తయారు చేసిన 'పరమహంస' చిరపరిచితులే. మన దేశంలోని పేటెంట్ విభాగం వారు పరమహంస గారికి ఈ వినూత్న పద్ధతికి పేటెంట్ ఇవ్వడం జరిగింది. (పేటెంట్ ఆంగ్ల ప్రతిని ప్రక్కన చూడండి).

తెలుగు జాతి తరుపున 'పల్లెసృజన' పరమహంస కుటుంబానికి శుభాభినందనలు తెలియజేస్తున్నది.

హనీబీఏపి ఈ వినూత్న ఇన్నోవేషన్‌ను పారిశ్రామికంగా ఉత్పత్తి చేయుటకై కృషి చేస్తున్నది. ఈ శుభవార్త కూడా పాఠకులకు త్వరలోనే అందజేస్తామని ఆశిస్తున్నాము.

పేటెంట్ సంస్థలో మరో ముగ్గురు తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను రిజిష్టర్ చేయడం జరిగింది.

- బంగారు రాజు, కర్నూలు జిల్లా.
- శ్రీ లింగ బ్రహ్మం, వరంగల్ జిల్లా.
- శ్రీ నరసింహాచారి, నిజామాబాద్ జిల్లా.

ఈ పేటెంట్‌లను హనీబీఏపి, ఎన్.ఐ.ఎఫ్. సంస్థల ద్వారా నమోదు చేయబడినది. త్వరలోనే వరికి పేటెంటు ప్రదానం జరుగుతుందని ఆశిస్తున్నాం.

ఇంకా ఎందరో గ్రామాల్లోని ఇన్నోవేటర్ల పరిజ్ఞానాన్ని వెలికి తీసి వారి సృజనకు ఇలాంటి గుర్తింపు తీసుకు రావాలని పల్లెసృజన సదా కోరుకుంటోంది.

# స్పందన

ఎడిటర్ గారికి,

'పల్లెసృజన' జనవరి – మార్చి 2007 సంచిక చేరినప్పటినుండి నా హృదయపూర్వ అభినందనలు తెలియజేద్దామని అనుకుంటూనే ఉన్నాను. పల్లె ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో దాగివున్న ఉత్తమ ఇన్నోవేషన్లను వెలుగులోకి తెచ్చే మీ ప్రయత్నాలు ఎంతో అభినందనీయం. పల్లె సృజన సంపాదక వర్గానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈలోపే పల్లెసృజన మే-జూన్ 2007 సంచిక కూడా నాకు పంపారు. చాలా సంతోషం. ఈ పత్రిక అర్థవంతంగా వుంది. రైతాంగంతో, పల్లెసృజన పాఠకులతో గ్రామాల్లో బెల్లం నిల్వ చేసే కొన్ని వినూత్న పద్ధతులను ఎంచుకోవాలన్న ఉద్దేశ్యంతో నేను 1960లో 'ఇండియన్ జర్నల్ ఆఫ్ సుగర్‌కేన్'లో ప్రచురించిన వ్యాసాన్ని జతపరుస్తున్నాను. ఈ పద్ధతులు ఈనాటికి కూడా విలువైనవే. బెల్లం నిల్వ పద్ధతులు చెరుకు పండించే రైతులకు ఉపయోగకరంగా వుంటుంది. బెల్లం నిల్వ పద్ధతులు చెరకు పండించే రైతులకు ఉపయోగకరంగా వు,టుందని ఆశిస్తూ ఈ వ్యాసాన్ని పల్లెసృజనలో ప్రచురిస్తారని విశ్వసిస్తున్నాను. – **పి.వి. సూర్యప్రకాశరావు,** టెక్నికల్ మేనేజర్, ఉషోదయా ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్.

**మీ అభిమానానికి కృతజ్ఞతలు, మీరు పంపిన వ్యాసాన్ని ఈ సంచికలో ప్రచురించాం.** – ఎడిటర్.

*****

ఎడిటర్ గారికి,

'హనీబీఏపి' సంస్థ ప్రచురిస్తున్న పత్రిక 'పల్లెసృజన' పేరుకు తగ్గట్టుగానే సృజనాత్మకమైన పత్రిక. మన గ్రామాల్లో వుండే ఎంతోమందిలో బయటకు రాక ఆగిపోయిన లేక ప్రచారంలోకి రాని సృజనాత్మకతను వెలికి తీసి ఎన్నో ఉపయోగకరమైన అంశాలను వెలుగులోకి తీసుకు రావటానికి ఎంగానో ఉపయోగపడుతున్న సంచిక. నిత్య జీవితంలో అవసరమైన చిట్కా వైద్యాలను, మూలికా వైద్యాలను అందరికీ అందించటానికి కృషి చేస్తోంది. వ్యవసాయదారులకు అవసరమైన సస్యరక్షణ చర్యలను ఇంకా తక్కువ ఖర్చుతో, అందుబాటులో వున్న వస్తువులతో, తేలికగా ఉపయోగించుకోగల వ్యవసాయ పనిముట్లను, వాటిని తయారు చేసిన రైతు మిత్రులను వెలుగులోకి తీసుకు వస్తోంది. మన రాష్ట్రానికి సంబంధించిన విశేషాలనే కాకుండా వివిధ రాష్ట్రాల ఇన్నోవేషన్లను కూడా పరిచయం చేసి వాటికి ప్రచారం కల్పించి, అనేక రైతు సదస్సులలో ప్రదర్శింపజేసి, ఆ వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించటానికి కృషి చేస్తున్న సంస్థ హనీబీ. ఇది మాత్రమే కాదు, పల్లె ప్రజల్లో మరుగున పడివున్న సృజనాత్మకతను వెలికి తీయటానికి, సాంకేతిక ఆవిష్కరణల పోటీ నిర్వహించటానికి నడుం బిగించింది. ఇందుకుగాను నిస్వార్థంగా కృషి చేస్తున్న 'హనీబీఏపి' నిర్వాహకులు మరియు పల్లెసృజన పత్రిక సంపాదకవర్గము అభినందనీయులు. ఈ పత్రిక పల్లె పల్లెకు చేరి అందరికీ అందుబాటులోకి రావటానికి అందరం పాటుపడాలి. ఇందుకు నావంతు కృషి ఎల్లప్పుడూ వుంటుంది. – **పింగళి పద్మావతి,** యం.బి.-1, రైలుర్ బస్తీ, కొత్తగూడెం.

**మీలాంటి వారి సలహాలు, సహాయ సహకారాలు పల్లెసృజనకు ఎల్లప్పుడూ అవసరమే. సర్వదా కృతజ్ఞులం.** – ఎడిటర్.

*****

ఎడిటర్ గారికి,

నమస్కారములు, నేను పల్లెసృజన సంచికలు రెండు చదివాను. చాలా బాగున్నాయి. పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదన్నట్లుగా ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన ఆయుర్వేదం, గ్రామీణ సృజనాత్మక ప్రక్రియలు, ఆవిష్కరణలకు గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తున్న మీరు ప్రశంసనీయులు. అయితే నావి కొన్ని సూచనలు గమనించగలరు. పత్రికలో ఏదైనా ఔషధ మొక్క గూర్చి ప్రస్తావించినపుడు స్థానిక మాండలికాలతో దాని వ్యవహార మరియు శాస్త్రీయ నామాలు తెలుపగలరు. ఈ మొక్కల ఫొటోలను కలర్‌లో ముద్రిస్తే స్పష్టంగా గుర్తించుటకు అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాల గురించి ఇంకా చాలా మందికి తెలియదు. తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకుగాను ప్రతి జిల్లాలోని ప్రతి పాఠశాలకు 'పల్లెసృజన' కార్యక్రమాలను గూర్చి తెలయజేస్తూ పోస్టు కార్డులను పంపితే బాగుంటుంది. దీనివలన పాఠశాలలోని ఉపాధ్యాయులకు మరింతగా తెలుస్తుంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని, ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు గ్రామీణులతో మరింత సంబంధాలను కలిగి వుంటారు. కావున మరిన్ని గ్రామీణ సృజనాత్మక ప్రక్రియలను, ఆవిష్కరణలను తెలుసుకొనుటకు అవకాశం ఉంటుంది. నూతన విషయాలను గ్రామీణుల నుండి సేకరించి, తమరికి అందజేసిన వారి పేర్లను, వివరాలను తెలియజేస్తే బాగుంటుంది. దీనివలన వారికి మరియు ఇతరులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.

– **శ్రీమతి జి. వీణ,** టీచర్, రామచంద్రాపురం, మెదక్ జిల్లా.

**మీ సూచనలను తప్పక పాటించేందుకు కృషి చేస్తాము. పత్రిక రంగుల్లో ముద్రించేందుకు 'పల్లెసజన' ఇంకా ఎంతో కోలుకోవలసిన అవసరముంది. త్వరలో మన ఈ కోరిక నెరవేరగలదని ఆశిద్దాం.** – ఎడిటర్

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనీటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.

### చందా వివరాలు

| | రూ. |
|---|---|
| **సంవత్సర చందా** | |
| వ్యక్తిగతంగా | 100/- |
| సంస్థ లేదా లైబ్రరీకి | 1,000/- |
| **జీవిత చందా (15 సంవత్సరాలు)** | |
| వ్యక్తిగతంగా | 1,000/- |
| సంస్థ లేదా లైబ్రరీకి | 10,000/- |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కుల రూపంలో పంపవలసిన చిరునామా**

శ్రీమతి అరుణ గణేశం,
అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
55, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
e-mail : honeybeeap@gmail.com

# సన్నకారు రైతులకు వరం


# 10 హెచ్.పి. ట్రాక్టర్

ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీని సన్నకారు రైతులకూ అందించాలన్న దృక్పథంతో రైతుల కష్టాలు తెలిసిన గుజరాత్‌కు చెందిన 'భాంజీభాయ్ మథుకియా' తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో కేవలం 10 హెచ్.పి. సామర్థ్యంతో నడిచే ఒక ట్రాక్టరును తయారు చేశారు. ఈ ట్రాక్టరును 3 మరియు 4 చక్రాలతో రెండు విధాలుగా తయారు చేసి అజేయంగా చిన్న చిన్న వ్యవసాయ పనులను సమర్థవంతంగా చేసుకుంటున్నాడు. భాంజీభాయ్ కలలకు సాకారంగా తయారైన ఈ ట్రాక్టర్ భారత దేశమంతటా సన్నకారు రైతులకు అందుబాటులోకి తేవడానికి ఎన్.ఐ.ఎఫ్. విస్తృత ప్రయత్నాలు సాగిస్తోంది. అతి త్వరలోనే ఈ ట్రాక్టరు మార్కెట్‌లోకి వచ్చి సన్న, చిన్నకారు రైతులకు కేవలం లక్షన్నర రూపాయలకు లభ్యం కాబోతోంది.

**ఈ యంత్రం యొక్క ప్రత్యేకతలు :** తక్కువ డీజిల్ సామర్థ్యంతో వివిధ రకాలైన చిన్న చిన్న వ్యవసాయ పనులను అత్యంత సమర్థవంతంగా పూర్తి చేయగలుగుతుంది.

ఈ ట్రాక్టరు పనిచేస్తున్న విధానం మీరుచూడాలనుకుంటే 'హనీబీ'కి ఉత్తరం వ్రాస్తే ఈ ట్రాక్టరు పనిచేస్తున్న వీడియో సిడి. మీకు లభ్య కాగలదు. పూర్తి వివరాలు కావాలనుకున్నవారు 'పల్లెసృజన' కార్యాలయానికి ఉత్తరం వ్రాసి సి.డి. పొందగలరు. ఈ శోధన గ్రామీణ సన్నకారు రైతాంగానికి చాలా ఉపకరిస్తుందని 'పల్లెసృజన' ఆశిస్తోంది.






# గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే

## 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

**ఈ పోటీలు ఎందుకు? :** మన సమాజంలో దాగివున్న సృజనా శక్తిని వెలుగులోకి తెచ్చి, తద్వారా గ్రామీణ ప్రజల జీవన స్థాయిని పెంచాలన్న తపనే ఈ పోటీకి మూలం.

**ఎవరు పాల్గొనవచ్చు?:** ★ వృత్తిపరంగా, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల అనుభవం లేకుండా, తమ తమ వ్యక్తిగత స్థాయిలో వినూత్న ఆవిష్కరణలు సాధించిన వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు, సమాజాలు. – మహిళలు, మహిళా సమూహాలు పాల్గొనవచ్చు. – విద్యార్థులు, యువకులు వినూత్న విషయాల్ని ఆవిష్కరించినవి పంపవచ్చు. – గ్రామాల్లోని రైతులు, వృద్ధులు, అనుభవజ్ఞులు, పంటలకు, పశువులకు, ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగ సాఫల్యం అయిన ఆలోచనలను, ప్రక్రియలు పంపవచ్చును.

ఎలాంటివి పంపవచ్చు? ★ ఆవిష్కరణలు ఉత్పత్తులను పెంచే విషయంలోను, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించేవిగానూ, వ్యవసాయ పరంగా రైతులు లాభదాయకంగా ఉండే పద్ధతులూ,ఆలోచనలు ఆవిష్కరణలు ఈ పోటీకి పంపవచ్చు – ప్రకృతిలో లభించే చెట్టు ఆకులు, బెరడు, మొక్కల ద్వారా మనుష్యులకు, పశు సంతతికి, పంటలకు లాభాన్నిచ్చే ఆలోచనలు, ప్రయోగాలు పంపవచ్చు.

**ఎలాంటివి పంపవచ్చు? :** ★ వ్యక్తులు లేదా బృందాలు ఎన్ని ఎంట్రీలైనా పంపించవచ్చు. తెల్ల కాగితంమీద ఈ క్రింది వివరాలను నమోదు చేయడం అవసరం. 1. నూతన ఆవిష్కరణ విశిష్ఠత సంప్రదాయ విజ్ఞానం గురించిన వివరాలు, 2. నూతన ఆవిష్కరణకు దారితీసిన నేపథ్యం. 3. నూతన ఆవిష్కరణల్ని ఆవిష్కరించిన వ్యక్తుల నేపథ్యం. వారి విద్యార్హతలను గురించిన పూర్తి వివరాలు, వీటితోపాటు ఒక ఫొటో గ్రాఫ్, వీలైతే అదనపు సమాచారంలో కూడిన వీడియోలు.

మొక్కలకు సంబంధించిన వారాలతో కూడిన ఎంట్రీలను కూడా పంపించవచ్చు. అయితే ఈ మొక్కల ఎండు భాగాల్ని ఎండు భాగాలను నమూనాలుగా పంపిచవలసి ఉంటుంది.

| బహుమతుల కేటగిరి | బహుమతి (రూపాయలు) ప్రథమ | ద్వితీయ | తృతీయ |
|---|---|---|---|
| ★ తమ వృత్తులు నిర్వహించడానికి వినూత్న పద్ధతులను కనుగొన్నవారు వారి వృత్తులకు సంబంధించిన పరికరాలు, పనిముట్లు, యంత్రాలు వృత్తి సులభతరం చేసే ప్రయోగాలు కనుగొన్నవారు | ఒక లక్ష | 50 వేలు | 25 వేలు |
| ★ విద్యార్థులు | 15 వేలు | 10 వేలు | 5 వేలు |
| ★ పరిశోధనలను వెతికి వెలుగులోకి తేవడానికి అసాధారణ కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు | 25 వేలు | 10 వేలు | – |
| ★ ఔషధ మొక్కల గొప్పతనాన్ని తెలియజేసినవారు | 50 వేలు | 25 వేలు | 15 వేలు |

★ అర్హులైన ఎంట్రీలకు ప్రశంసా పత్రాలు ఇవ్వబడును. ★ అసాధారణ ఆవిష్కరణలను 'హనీబీ' మరియు అన్ని ప్రాంతీయ పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. ఎన్.ఐ.ఎఫ్. వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.

**పాల్గొనుటకు ఆఖరు తేది :** రెండు సంవత్సరాలకోసారి నిర్వహింపబడు ఈ పోటీలో పాల్గొనుటకు చివరితేది 31 డిసెంబర్ 2008. ఇప్పటివరకు ఇలాంటివి 5 పోటీలు నిర్వహింపబడినవి. ఇది ఆరవ పోటీ.

ఎంట్రీలు పంపువారు తమ పూర్తి చిరునామా వివరంగా వ్రాయాలి. అందువల్ల భవిష్యత్తులో ఉత్తర ప్రత్యుత్తరాలకు వీలవుతుంది. "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (NIF) వెబ్‌సైట్ www.nifindia.orgలో మిగతా వివరాలను పొందవచ్చును.

**ఎంట్రీలను పంపవలసిన చిరునామా :**
National Co-ordinator,
(Scouting and Documentation)
National Innovation Founation,
Satellite Complex, Bunglow No. 1,
Premchand Road, Jodhpur Tekra,
Ahmedabad - Gujarat - 380 015.

**వివరాలకు సంప్రదించండి :**
A.P. State Co-ordinator,
(Scouting and Documentation)
HONEYBEEAP, 102, Vayupuri,
Sainikpuri Post, Hyderabad - 500 094.
Ph.: 040-27118555, Mobile : 98660 01678.
E-mail : honeybeeap@gmail.com